




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 361 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 3 సెప్టెంబర్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :361 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 3 SEPTEMBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## టీడీపీకి ఆ ధైర్యం లేదు




- నల్లపురెడ్డిపల్లెలో పర్యటించిన మాజీ సీఎం జగన్
- ఓటర్ల స్వేచ్ఛను చంద్రబాబు హరించారంటూ ప్లకార్డులు ప్రదర్శించిన స్థానికులు
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడుతూ, ప్రజల ఓటు హక్కును కూడా కాలరాస్తున్నారని ఆయన మండిపడ్డారు. కడప జిల్లా నల్లపురెడ్డిపల్లెలో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా, ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడ్డారంటూ పలువురు గ్రామస్థులు ఆయన వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..



## ఎటుచూసినా అమరావతి ఆకర్షణీయంగా ఉండాలి

### సీఆర్డీఏకి చంద్రబాబు దిశానిర్దేశం

### రాజధాని నిర్మాణంలో మరో ముందడుగు

### 7 కీలక నిర్ణయాలకు సీఆర్డీఏ ఆమోదం

### రాజధాని పనుల కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) ఏర్పాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాజధానిలో చేపట్టాల్సిన ప్రధాన ప్రాజెక్టులను సకాలంలో, పూర్తిచేయడమే లక్ష్యంగా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని (స్పెషల్ పర్పస్ వెహికల్ – ఎస్పీవీ) ఏర్పాటు చేయాలని నిర్ణయిం చింది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన 52వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ మేరకు ఆమోదముద్ర వేశారు. మొత్తం 7 కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించి, అంగీకారం తెలిపారు. రాజధాని అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను కార్యాచరణలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా సీఎం అధికారులను ఆదేశించారు. ఎటుచూసినా అమరావతి నగరం ఆకర్షణీయంగా కనిపించాలని దిశానిర్దేశం చేశారు.

**ఎస్పీవీ పరిధిలోకి కీలక ప్రాజెక్టులు**

రాజధాని అమరావతికి తలమానికంగా నిలవనున్న అనేక కీలక ప్రాజెక్టుల బాధ్యతను ఇకపై ఈ ఎస్పీవీ పర్యవేక్షించనుంది. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, ఐకానిక్ వంతెన, ఎన్టీఆర్ విగ్రహం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు, కృష్ణా నది రివర్ ఫ్రంట్, రోప్ వే వంటి భారీ నిర్మాణాల

వివరాలు 2లో..

## అమెరికాకు లొంగే ప్రసక్తే లేదు

### కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టీకరణ



- డెడ్‌లైన్లతో ఒప్పందాలు కుదరవన్న పీయూష్ గోయల్
- ఇరు దేశాలకు ప్రయోజనం ఉంటేనే ఒప్పందాలు అన్న కేంద్ర మంత్రి
- యూరోపియన్ యూనియన్‌తో చర్చలు చివరి దశలో ఉన్నాయని వెల్లడి

వివరాలు 2లో..

## బీఆర్ఎస్ కు పట్టిన గతే జనసేనకు పడుతుంది!

### సీపీఐ నారాయణ హెచ్చరిక

- బీజేపీపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్ర విమర్శలు
- ప్రాంతీయ పార్టీలకు బీజేపీ భస్మాసుర హస్తం వంటిదని వ్యాఖ్య
- తెలంగాణలో బీఆర్ఎస్ చీలికకు బీజేపీనే కారణమని ఆరోపణ
- శివసేన, ఎన్సీపీల ఉదంతాలను గుర్తు చేసిన నారాయణ
- బీజేపీతో పొత్తు కొనసాగిస్తే జనసేనకు కూడా అదే పరిస్థితి వస్తుందని హెచ్చరిక

వివరాలు 2లో..




## నేర చరిత్ర ఉంటే దేశంలోకి నో ఎంట్రీ!

### విదేశీయులపై కేంద్రం కఠిన వైఖరి..



- గతంలో నేరాలకు పాల్పడిన విదేశీయుల రీఎంట్రీపై నిషేధం
- వారి కోసం ప్రత్యేక నిర్బంధ శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- సరిహద్దుల్లో అక్రమ వలసదారులను అడ్డుకోవాలని సూచన
- పాక్, చైనా, అఫ్ఘనిస్థాన్ దేశస్థులకు కొన్ని ప్రాంతాల్లో ప్రవేశం బంద్
- భారత్‌లో పనిచేసే విదేశీ ఉద్యోగులకు సైతం కొత్త షరతులు

పెన్ పవర్ డెస్క్: దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో గతంలో నేరాలకు పాల్పడి, దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న విదేశీయులు తిరిగి దేశంలోకి ప్రవే శించకుండా కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..

### కష్టపడిన వారికి, కేవలం ఫోటోలు దిగేవారికి తేడా చూపిస్తామని

## గతంలోనే చెప్పా

- బుగ్గలేటిపల్లెలో ఉత్తమ కార్యకర్తల సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరైన నారా లోకేశ్
- పార్టీలో కష్టపడిన వారినే పదవులు వరిస్తాయని వెల్లడి
- సిఫార్సులు కాదు.. పనితీరే కొలమానం అని తేల్చిచెప్పిన వైనం

వివరాలు 2లో..





## సుగాలి ప్రీతి కేసులో కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం

- సుగాలి ప్రీతి కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వ నిర్ణయం
- ఈ కేసుపై పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి
- కేబినెట్ సమావేశంలో చర్చకు రానున్న అంశం

వివరాలు 2లో..

### ప్రపంచం సవాళ్లు ఎదుర్కొంటున్నా...

## 7.8 శాతం వృద్ధి సాధించాం

- ఆర్థిక స్వార్థంతో ప్రపంచ దేశాలు సతమతం
- భారత్ మాత్రం 7.8 శాతం జీడీపీ వృద్ధి సాధించిందన్న ప్రధాని
- భారత్‌పై ప్రపంచానికి నమ్మకం పెరిగిందన్న మోదీ
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం ఖాయమని ధీమా



పెన్ పవర్ డెస్క్:ప్రపంచంలోని అనేక దేశాలు 'ఆర్థిక స్వార్థం' కారణంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటుంటే, భారత్ మాత్రం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటును నమోదు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మంగళవారం జరిగిన 'సెమికాన్ 2025' సదస్సులో ఆయన మాట్లాడుతూ, ప్రపంచం అనిశ్చితిలో ఉన్నప్పటికీ భారత్

వివరాలు 2లో..

## జగన్ కు చంద్రబాబు విసిరిన సవాల్ ఒక ఏడుపులా ఉంది

- జగన్ అంటే భయమా అని ప్రశ్నించిన సజ్జల
- మీ మంద బలంతో ప్రతిపక్ష గొంతు నొక్కుతారా అని ప్రశ్న
- ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవడం చంద్రబాబు ఘనత అంటూ ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:అసెంబ్లీకి హాజరుకావాలంటూ వైసీపీ అధినేత జగన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు విసిరిన సవాల్ ఒక ఏడుపులా ఉందని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే ముందుగా వైఎస్ జగన్‌కు ప్రతిపక్ష హోదా కల్పించాలని ఆయన సవాల్ విసిరారు. ప్రతిపక్ష హోదా ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ఆయన సూటిగా ప్రశ్నించారు.

వివరాలు 2లో..



## అసలైన వెన్నుపోటుదారుడు జగనే

- చేయని తప్పుకు చంద్రబాబు మూడు దశాబ్దాల నుంచి నిందను మోస్తున్నారు: వర్ల రామయ్య
- చంద్రబాబు వెన్నుపోటుదారుడు కాదు, పార్టీని కాపాడిన ప్రొటెక్టర్ అన్న వర్ల
- అసలైన వెన్నుపోటు రాజకీయాలు మొదలైందే వైఎస్ కుటుంబం నుంచి అని విమర్శలు
- తండ్రి, తల్లి, చెల్లి, బాబాయికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్ రెడ్డి అని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోటుదారుడు కాదని, ఆయన పార్టీని, రాష్ట్రాన్ని కాపాడిన నిజమైన 'ప్రొటెక్టర్' అని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య స్పష్టం చేశారు. అసలైన వెన్నుపోటు రాజకీయాలకు ఆద్యులు వైఎస్ కుటుంబీకులేనని, వైసీపీ అధినేత జగన్ సిసలైన 'వెన్నుపోటుదారుడు' అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుపై దశాబ్దాలుగా చేస్తున్న వెన్నుపోటు ఆరోపణలపై ఎవరైనా తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

వివరాలు 2లో..



## దేవుడు రాజశేఖర్ రెడ్డి గారిని గొప్పగా వాడుకున్నారు

- వైఎస్ఆర్ 16వ వర్ధంతి
- నివాళులు అర్పించిన కుమార్తె షర్మిల
- ప్రజల గుండెల్లో నాన్న ఇప్పటికీ బతికే ఉన్నారని భావోద్వేగ వ్యాఖ్యలు
- దేవుడి పటాల పక్కన వైఎస్ఆర్ ఫొటో పెట్టి పూజలు చేస్తున్నారని వెల్లడి



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఊహకందని విప్లవం.. పవన్... !

సాధారణంగా.. ఒక విప్లవం పుడుతోందంటే.. దీనికి ముందు కొన్ని సంకేతాలు వస్తాయి. కానీ.. ఎలాంటి సంకేతాలు లేకుండా.. ఒక సాధారణ రాజకీయ నేతగా.. తన పంథాను కొనసాగించి.. ఒక సాధారణ రాజకీ య పార్టీని స్థాపించిన పవన్ కల్యాణ్.. ఊహకందని విప్లవాన్ని సృష్టించారు. "ఇక, జెండే ఎత్తేస్తారు.." అని ఓవర్గం నాయకులు చేసిన ప్రచారం నుంచి బలమైన పీఠాన్ని ఏర్పాటు చేసుకున్న దశ వరకు పవన్ కల్యాణ్ అడుగులు సుదీర్ఘ లక్ష్యాన్ని పట్టి చూపుతాయి."ఇలా వచ్చి.. అలా పోయిన పార్టీలు అనేకం ఉన్నాయి. ఇది కూడా అంతే!" అని తొలినాళ్లలో ఎదురైన పెదవి విరుపులు.. సహాయ నిరాకరణలను కూడా ఛేదించి.. తన పార్టీని.. తనతో పాటు.. ముందుకు నడిపించారు పవన్ కల్యాణ్. సినిమా ఇమేజ్.. ఏమేరకు పనిచేస్తుంది... అనేది చిరంజీవి పార్టీ పెట్టిన కొత్తలో తర్వాత.. అందరికీ అనుభవంలోకి వచ్చింది. అందుకే.. పవన్ తన ఇమేజ్‌ను మాత్రమే నమ్ముకోలేదు. ప్రజలను.. పేదలను.. రైతాంగాన్ని నమ్ముకున్నారు. వారి సమస్యల్లో నేనున్నానంటూ అడుగులు వేశారు.ఇది పవన్‌కు రాజకీయ నేతగా సుస్థిరత్వాన్ని ఆపాదించింది. అంతేకాదు.. వేసిన అడుగులు తొలినాళ్లలో విమర్శలకు దారితీసేలా చేసినా.. తర్వాత తర్వాత.. సమాజం మొత్తం ఆయన వెంట నడిచేలా చేసింది. ఎక్కడ ఎలా స్పందించాలో.. ఎక్కడ ఎలా తగ్గాలో రాజకీయాల్లో నాయకులకు అత్యంత కీలకం. ఇది తెలిసిన వారే నేతలుగా నిలబడ్డారు. ఈ తరహాలోనే పవన్ కూడా.. 2023లో చంద్రబాబుకు మద్దతు మరోసారి మద్దతు ఇచ్చే విషయంలో తనను తాను తగ్గించుకుని వేసిన అడుగులు తర్వాత.. కాలంలో ఊహించని విజయాన్ని.. విప్లవాన్ని సైతం చేరువ చేశాయి.మంగళవారం ఆయన పుట్టిన రోజు. శుభాకాంక్షలు.. వెల్లువెత్తుతున్నాయి. కానీ, ఇదేసమయంలో ఆయన రాజకీయ జీవితమే కాదు.. సినీ ప్రస్థానంలోనూ.. తొలినాళ్లలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా.. ఆయన ఎదిగిన తీరు.. అందరికీ ఆదర్శమే. ఎలా ఎదగాలన్న విషయాన్ని ఆయన నుంచి నేర్చుకునే స్థాయికి పవన్ ఎదిగారు. పదవులు ఉంటాయి.. పోతాయి.. కానీ, ప్రజల హృదయాలను గెలుచుకోవడంలోనే అసలు రాజకీయం ఉంది.ఇదే.. ఆయనను గిరిజనులకు చేరువ చేసింది... ఎస్సీ, ఎస్టీలకు మచ్చిక చేసింది. పార్టీని స్థాపించి ఆయన విప్లవం సృష్టించలేదు. .. ఆ పార్టీని ప్రజలు తమది అనుకునే స్థాయికి చేరుకునేలా చేసి విప్లవం సృష్టించారు. రెండు స్థానాల్లో ఓడినా.. తదుపరి ఎన్నికల్లో తాను గెలిచి.. తన వారిని గెలిపించుకునే స్థాయికి ఎదిగిన తీరు విప్లవం. పదవులను అలంకార ప్రాయంగా కాకుండా.. పనిచేసేలా చేసి.. చూపుతున్న వైనం.. ఓ విప్లవం. అందుకే.. పవన్.. ఏపీ రాజకీయాల్లో.. ఊహకందని విప్లవం.

# దేవుడు రాజశేఖర్ రెడ్డి గారిని గొప్పగా వాడుకున్నారు

దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె, ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ఘన నివాళులు అర్పించారు. తన తండ్రి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఇప్పటికీ ఎందరో తమ ఇళ్లలో దేవుడిగా పూజిస్తున్నారని ఆమె భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు."వైఎస్ఆర్ గారిది అద్భుతమైన జీవితం. దేవుడు రాజశేఖర్ రెడ్డి గారిని గొప్పగా వాడుకున్నారు. ఆయన మరణించి 16 ఏళ్లు అయినా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. ఇప్పటికీ దేవుడి పటాల పక్కన వైఎస్ఆర్ గారి ఫోటో పెట్టి పూజిస్తున్నారు. ఆరోగ్య శ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్ మెంట్ లాంటి గొప్ప పథకాలు వైఎస్ఆర్ గుండెల్లోంచి పుట్టినవి. ఈ పథకాలతో లబ్ధి పొందని తెలుగు గడపే లేదు. వైఎస్ఆర్ గారిని గుండెల్లో పెట్టుకొని పూజించే ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు. వైఎస్ఆర్ గారు చనిపోయాక ఆ బాధను జీర్ణించుకోలేక గుండె పగిలి 700 మంది చనిపోయారు. ఈ సందర్భంగా వారికి కూడా మనసారా నివాళులు అర్పిస్తున్నాం" అని షర్మిల పేర్కొన్నారు.

# అసలైన వెన్నుపోటుదారుడు జగనే

- మొదటి పేజీ తరువాయి

మంగళవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ, "జగన్ గారు గోబెల్స్ ప్రచారంలో ఆరితేరిపోయారు. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్లు చూపించడంలో హిట్లర్ ప్రచార మంత్రి గోబెల్స్‌ను కూడా ఆయన దాటిపోయారు. ఎంతో సహనశీలి అయిన చంద్రబాబు, తాను చేయని తప్పుకు మూడు దశాబ్దాలుగా వెన్నుపోటు అనే నిందను మోస్తున్నారు. ఆయన వెన్నుపోటుదారుడు కాదు, ఒక రక్షకుడు" అని అన్నారు.1995 నాటి ఆగస్టు సంక్షోభాన్ని గుర్తుచేస్తూ, "పేదవాడికి కూడు, గూడు, నీడ అందించాలన్న ఎన్టీఆర్ ఆశయాలతో పుట్టిన పార్టీ టీడీపీ. ఆనాడు పార్టీని, ఎన్టీఆర్‌ను ఒక దుష్టశక్తి కబళించాలని చూసినప్పుడు, దాని కబంధ హస్తాల నుంచి పార్టీని కాపాడిన మహాశక్తి చంద్రబాబు. అంతకుముందు కాంగ్రెస్ కోవర్టుల వల్ల ఎన్టీఆర్ సీఎం పదవి కోల్పోతే, దేశవ్యాప్తంగా ఉద్యమం చేసి 30 రోజుల్లోనే ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రిని చేసిన ప్రొటెక్టర్ కూడా చంద్రబాబే. ఆనాడు ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయానికి ప్రజలు 1999 ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టారు. ఒకవేళ చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టకపోయి ఉంటే, ఈరోజు సైబరాబాద్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు వంటివి ఉండేవా? హైదరాబాద్‌లో ఐటీ విప్లవం సాధ్యమయ్యేదా?" అని ఆయన ప్రశ్నించారు.వెన్నుపోటు చరిత్ర వైఎస్ కుటుంబంతోనే మొదలైందని వర్ల రామయ్య సంచలన ఆరోపణలు చేశారు. "బతుకుదెరువు కోసం వచ్చిన జగన్ తాత రాజారెడ్డికి, బైరటీస్ గనిలో వాటా ఇచ్చి ఆశ్రయం కల్పించిన బీసీ నేత జింకా వెంకట నర్సయ్యను వెన్నుపోటు పొడిచి ఆ గనిని మొత్తం లాక్కున్నది నిజం కాదా? ఆ రక్తపు కూడుతోనే మీ కుటుంబం కోట్లకు పడగలెత్తింది. ఇక, తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని కొడుకుతో రూ. 43 వేల కోట్లు అక్రమంగా సంపాదించేలా చేసి, ప్రజలను వెన్నుపోటు పొడిచిన వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఆయన బతికి ఉంటే, జగన్‌పై ఉన్న కేసుల్లో ఏ1గా వైఎస్ఆర్, ఏ2గా జగన్ ఉండేవారు" అని ఆరోపించారు.జగన్ తన సొంత కుటుంబ సభ్యులకే వెన్నుపోటు పొడిచారని రామయ్య విమర్శించారు. "తండ్రి శవం ఇంటికి రాకముందే ముఖ్యమంత్రి పదవి కోసం సంతకాలు సేకరించి కన్నతండ్రికే వెన్నుపోటు పొడిచారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని తల్లిని, చెల్లిని దూరం పెట్టింది నిజం కాదా? ఎత్తుకొని పెంచిన సొంత బాబాయి వివేకానంద రెడ్డిని అత్యంత దారుణంగా హత్య చేయించి, ఇప్పుడు నిందితులను కాపాడుతూ ఆయన కుమార్తె సునీతకు అన్యాయం చేస్తున్నది ఎవరు? ఇవన్నీ వెన్నుపోట్లు కావా?" అని నిలదీశారు. నవరత్నాల పేరుతో ప్రజలను, నాసిరకం మద్యంతో వారి ఆరోగ్యాన్ని దెబ్బతీసి రాష్ట్ర ప్రజలందరినీ మోసం చేశారని మండిపడ్డారు. ఈ అంశాలపై చర్చించేందుకు సజ్జల రామకృష్ణారెడ్డి కానీ, రోజా కానీ బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.

# కష్టపడిన వారికి, కేవలం ఫోటోలు దిగేవారికి తేడా చూపిస్తామని గతంలోనే చెప్పా

తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారినే పదవులు వరిస్తాయని, సిఫార్సులకు, పైరవీలకు ఎలాంటి అవకాశం ఉండదని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పనితీరు మాత్రమే ప్రామాణికమని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికే సముచిత గౌరవం దక్కుతుందని ఆయన తేల్చిచెప్పారు. కమలాపురం నియోజకవర్గం బుగ్గలేటిపల్లెలో జరిగిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గత ఐదేళ్లలో మనం చేపట్టిన 'బాదుడే, బాదుడు', 'బాబు ష్యూరిటీ %-% భవిష్యత్తుకు గ్యారంటీ' వంటి పది కీలక కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వల్లే 2024 ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించాం. ఈ కార్యక్రమాల కోసం ఎవరు కష్టపడ్డారో టెక్నాలజీ సహాయంతో గుర్తించాం. కష్టపడిన వారికి, కేవలం ఫోటోలు దిగేవారికి తేడా చూపిస్తామని గతంలోనే చెప్పాను. ఆ మాట ప్రకారమే, పనిని నమ్ముకున్న వారిని వెతుక్కుంటూ మేమే వస్తాం. ఎవరి సిఫార్సులతోనూ పదవులు రావు" అని అన్నారు. సెప్టెంబరు నెలాఖరు నాటికి అన్ని స్థాయిల్లో కమిటీల నియామక ప్రక్రియను పూర్తి చేసి, అక్టోబర్ నుంచి పార్టీ బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తామని లోకేశ్ వెల్లడించారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై లోకేష్ తీవ్ర విమర్శలు చేశారు. "అధికారంలో ఉన్నప్పుడు అహంకారంతో విర్రవీగడం వల్లే వైసీపీ 151 సీట్ల నుంచి 11కి పడిపోయింది. ఇప్పటికీ జగన్‌ను కలవాలంటే సొంత పార్టీ కార్యకర్తలకే వీఐపీ పాస్ కావాలట. మనం అలా ఉండకూడదు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే బాధ్యతగా మెలగాలి. అహంకారంతో కాదు, ప్రేమ, ఆప్యాయతలతో ప్రజల మనసులను గెలుచుకోవాలి" అని కార్యకర్తలకు హితవు పలికారు. కడప, కర్నూలు జిల్లాల్లో పార్టీ అత్యధిక సీట్లు గెలవడానికి మన నాయకులు, కార్యకర్తల ఓర్పు, సహనమే కారణమని కొనియాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇబ్బందులకు గురైన కార్యకర్తలకు అండగా ఉంటామని లోకేశ్ భరోసా ఇచ్చారు. "2019 నుంచి 2024 మధ్య కాలంలో తప్పుడు కేసులు ఎదుర్కొన్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం. వారిని కేసుల నుంచి విముక్తి కల్పిస్తాం. పార్టీ కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. 'రెడ్ బుక్' తన పని తాను

చేసుకుపోతుంది" అని హెచ్చరించారు. మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు, ఉపాధి హామీ బిల్లులన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాల అమలులో ఏమైనా సమస్యలుంటే స్థానిక నాయకత్వం దృష్టికి తీసుకురావాలని, వాటిని ఎక్కడికక్కడ పరిష్కరిస్తామని తెలిపారు. "మేము తీసుకునే పది నిర్ణయాల్లో మూడు తప్పు కావచ్చు, కానీ వాటిని వెంటనే సరిదిద్దుకుని ముందుకు వెళతాం. 2029 ఎన్నికల్లో మళ్లీ చరిత్ర తిరగరాయాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీదా రవిచంద్ర, కడప పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు రెడ్డివారి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సబిత, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎటుచూసినా అమరావతి ఆకర్షణీయంగా ఉండాలి

- మొదటి పేజీ తరువాయి

ప్రణాళిక, నిధుల సమీకరణ, అమలు, నిర్వహణ బాధ్యతలను ఈ ప్రత్యేక సంస్థే చూసుకుంటుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని, అత్యంత ప్రాధాన్యత కలిగిన 'బయో డిజైన్ ప్రాజెక్టు'ను కూడా ఎస్పీవీ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ తరహాలోనే ఒక 'హెల్త్ సిటీ'ని కూడా అభివృద్ధి చేయనున్నామని, అందులో భాగంగానే ఈ బయో డిజైన్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుందని ఆయన వెల్లడించారు. ప్రజారోగ్య సేవల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చే ఈ ప్రాజెక్టులో భాగస్వాములయ్యేందుకు అమెరికా, సింగపూర్ సహా ఏడు దేశాలకు చెందిన నిపుణులు, సంస్థలు ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేశాయని సీఎం తెలిపారు.

**మౌలిక వసతుల కల్పనకు గ్రీన్ సిగ్నల్**

అమరావతిలో పరిపాలన భవనాల సముదాయం (గవర్నమెంట్ కాంప్లెక్స్) నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పనులకు సంబం ధించిన టెండర్లకు కూడా సీఆర్డీఏ అథార్టీ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మొత్తం 53.68 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన రహదారులతో పాటు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. కేవలం నిర్మాణం మాత్రమే కాకుండా, ఏడేళ్ల పాటు ఆ రహదారుల నిర్వహణ బాధ్యతను కూడా టెండర్ దక్కించుకున్న సంస్థే చూసుకునేలా నిబంధనలు చేర్చినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

**ప్రతి నిర్మాణం ఒక అద్భుతంలా ఉండాలి**

రాజధాని ప్రాంతంలో చేపట్టే ప్రతి నిర్మాణం ప్రజలను ఆకట్టుకునేలా, ఒక అద్భుతంలా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. అర్బన్ డిజైన్లు, ఆర్కిటెక్చరల్ మార్గదర్శకాలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీకి అథారిటీ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డిజైన్ల ఆమోదం విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నగరం మొత్తం ఒక ప్రత్యేక ఆకర్షణతో కనిపించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మరోవైపు, సీఆర్డీఏ పరిధిలో కార్యకలాపాలు పెరిగిన నేపథ్యంలో అవసరమైన సిబ్బందిని డిప్యుటేషన్ లేదా ఆన్-డ్యూటీ పద్ధతిలో నియమించుకునేందుకు సీఎం అనుమతినిచ్చారు. రాజధానిలో ప్రపంచస్థాయి కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి కొన్ని ప్రముఖ హోటల్ సంస్థలు ముందుకొచ్చాయని అధికారులు తెలపగా, వాటికి భూములు కేటాయించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారు. అయితే నిర్మాణాలు అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండాలని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ అవసరాల నిమిత్తం ఏమైనా భూసేకరణ చేయాల్సి వస్తే, రైతులతో స్నేహపూర్వకంగా చర్చించి, వారికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రక్రియ పూర్తిచేయాలని సీఎం తేల్చిచెప్పారు. కృష్ణా నదిపై నిర్మించ తలపెట్టిన ఐకానిక్ వంతెన డిజైన్లపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నదిలోని లంక భూములను (ద్వీపాలను) అభివృద్ధి చేసి, పర్యాటకులను ఆకర్షించే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, పురపాలక, సీఆర్డీఏ, ఏడీసీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సుగాలి ప్రీతి కేసులో కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన సుగాలి ప్రీతి కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. దీనికి సంబంధించి త్వరలోనే సీబీఐకి అధికారికంగా లేఖ రాయనుంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన సీఐడీ ఉన్నతాధికారులతో సమావేశమై కేసు పురోగతిపై ఆరా తీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి పవన్ కల్యాణ్ ఈ కేసుకు సంబంధించి గళం విప్పుతున్న విషయం తెలిసిందే. అప్పట్లో ఆయన కర్నూలు వెళ్లి సుగాలి ప్రీతి కుటుంబాన్ని పరామర్శించి, వారికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.ఆనాడు పవన్ కల్యాణ్ ఒత్తిడితో గత వైసీపీ ప్రభుత్వం కేసు విచారణలో కొంత కదలిక తీసుకువచ్చినప్పటికీ, అప్పటికే కీలకమైన సాక్ష్యాధారాలు లేకుండా పోయాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, కేసును నిష్పక్షపాతంగా విచారించాలంటే సీబీఐ జోక్యం అవసరమని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. ఎల్లుండి జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, అధికారికంగా ఆమోదముద్ర వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. మంత్రివర్గ ఆమోదం తర్వాత, కేసును సీబీఐకి బదిలీ చేసే ప్రక్రియను ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించనుంది.

# బీఆర్ఎస్ కు పట్టిన గతే జనసేనకు పడుతుంది!

బీజేపీతో జతకట్టే ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రమాదంలో పడుతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. బీజేపీ అందించేది అభయహస్తం కాదని, అది పార్టీలను నాశనం చేసే 'భస్మాసుర హస్తం' అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి, వాటిలో చీలికలు తీసుకురావడమే బీజేపీ వ్యూహమని నారాయణ ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితిని ఇందుకు ఉదాహరణగా ఆయన ప్రస్తావించారు. బీజేపీకి దగ్గర కావడం వల్లే బీఆర్ఎస్‌లో విభేదాలు తలెత్తాయని, ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్ వంటి పరిణామాలకు కూడా ఆ పార్టీయే కారణమని ఆయన విమర్శించారు. ఇదే తరహాలో మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలను, తమిళనాడులో అన్నాడీఎంకేను బీజేపీ బలహీనపరిచిందని గుర్తు చేశారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని జనసేన పార్టీ భవిష్యత్తుపై నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో పొత్తు కొనసాగిస్తే పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనకు కూడా ఇదే గతి పడుతుందని ఆయన జోస్యం చెప్పారు. బీజేపీ భస్మాసుర హస్తం ప్రభావం మిత్రపక్షాలైన చంద్రబాబు వంటి నేతలకు కూడా తప్పదని హెచ్చరించారు. రాజకీయంగా నిలదొక్కుకోవాలంటే ప్రాంతీయ పార్టీలన్నీ బీజేపీకి దూరంగా ఉండటమే శ్రేయస్కరమని నారాయణ సూచించారు.

# జగన్ కు చంద్రబాబు విసిరిన సవాల్ ఒక ఏడుపులా ఉంది

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ, "ప్రతిపక్ష హోదా ఇస్తే ప్రజల తరఫున మా గొంతు వినిపిస్తాం. కానీ మీకున్న మంద బలంతో మా గొంతు నొక్కాలని చూస్తున్నారు. అందుకే జగన్‌కు ఆ హోదా ఇవ్వడం లేదు. మీరు ఆ హోదా ఇస్తే చాలు, మీ అందరికీ సమాధానం చెప్పడానికి జగన్ ఒక్కరే సరిపోతారు" అని వ్యాఖ్యానించారు. కేవలం మీడియా సమావేశంలో మాట్లాడితేనే సమాధానం చెప్పలేక టీడీపీ నేతలు దూషణలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు.చంద్రబాబు పాలనపై కూడా సజ్జల తీవ్ర విమర్శలు చేశారు. "ముప్పై ఏళ్లు సీఎంగా చేశానని చంద్రబాబు చెప్పుకుంటారు. కానీ ఆయన పేరు చెప్పగానే ఎన్టీఆర్‌ను ఎలా వెన్నుపోటు పొడిచారన్నదే గుర్తుకొస్తుంది. ఆ వెన్నుపోటుపై ఆయన సంబరాలు చేసుకోవాలి" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కుటుంబ సభ్యులను, కోర్టులను చంద్రబాబు ఎలా మేనేజ్ చేశారో అందరికీ తెలుసని ఆరోపించారు. స్పీకర్‌ను 'బూతుల్లో ఎక్స్‌పర్ట్' అని అభివర్ణించిన సజ్జల, ఆయన ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సజ్జల ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. యూరియా కోసం రైతులు గంటల తరబడి చెప్పులు లైన్‌లో పెట్టి ఎదురుచూస్తున్నారు. చివరికి సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది" అని విమర్శించారు. చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, అందుకే ప్రజల్లోకి వెళ్లాలంటే భయపడుతున్నారని అన్నారు. ఆయన కార్యక్రమాలన్నీ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను తలపిస్తున్నాయని విమర్శించారు. ప్రజల్లోకి వెళితే చంద్రబాబును వెంటపడి కొడతారని సజ్జల హెచ్చరించారు.

# నేర చరిత్ర ఉంటే దేశంలోకి నో ఎంట్రీ!

- మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.గతంలో భారత్‌కు వచ్చి గూఢచర్యం, ఉగ్రవాద కార్యకలాపాలు, హత్యలు, అత్యాచారాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడి దోషులుగా తేలిన విదేశీ పౌరులను గుర్తించి, వారిని మళ్లీ దేశంలోకి అడుగుపెట్టనీయకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని హోంశాఖ స్పష్టం చేసింది. ఒకవేళ అలాంటి వారు దేశంలో ఎక్కడైనా కనిపిస్తే తక్షణమే అదుపులోకి తీసుకోవాలని సూచించింది. ఇందుకోసం ఇటీవల అమల్లోకి తెచ్చిన ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ చట్టం (2025) ప్రకారం ప్రత్యేక హోల్డింగ్ సెంటర్లు లేదా నిర్బంధ శిబిరాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.సరిహద్దుల వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేయాలని హోంశాఖ ఆదేశించింది. అక్రమ వలసదారులు దేశంలోకి చొరబడకుండా నిరోధించేందుకు సరిహద్దు రక్షణ దళాలు, కోస్ట్ గార్డులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపింది. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, చైనా, పాకిస్థాన్‌లలో జన్మించిన వారికి భారత్‌లోని కొన్ని సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించడంపై నిషేధం విధించింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, లడఖ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రదేశాలకు వారు వెళ్లకుండా చూడాలని పేర్కొంది. అంతేకాకుండా, భారత్‌లో ఉద్యోగం చేయడానికి సరైన వీసా ఉన్న విదేశీయులు సైతం స్థానిక అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, నీరు, పెట్రోలియం వంటి కీలక రంగాల్లోని ప్రైవేటు సంస్థల్లో చేరకూడదని కొత్త షరతు విధించింది. పర్వతారోహణ వంటి కార్యక్రమాలు చేపట్టాలంటే కూడా తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది.

# టీడీపీకి ఆ ధైర్యం లేదు

- మొదటి పేజీ తరువాయి

కూటమి ప్రభుత్వం ఓటర్లపై కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. "ఓటర్ల స్వేచ్ఛను హరించిన చంద్రబాబు" అంటూ ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసనను తెలిపారు.గ్రామస్థులు చెప్పిన విషయాలపై జగన్ స్పందిస్తూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించే ధైర్యం తెలుగుదేశం పార్టీకి లేదు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా అడ్డుకున్నారు. పోలీసుల సాయంతో దౌర్జన్యాలు చేశారు" అని జగన్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలతో ప్రజలను మోసం చేశారని కూడా ఆయన విమర్శించారు.

# అమెరికాకు లొంగే ప్రసక్తే లేదు

అమెరికాతో వాణిజ్య ఒప్పందాల విషయంలో ఎలాంటి గడువులకు కట్టుబడి ఉండబోమని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ఇరుదేశాలకు సమానంగా ప్రయోజనం చేకూరే ఒప్పందాలకు మాత్రమే తాము సిద్ధంగా ఉంటామని ఆయన తేల్చిచెప్పారు. భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు నిలిచిపోయిన నేపథ్యంలో పరిశ్రమ వర్గాలతో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.భారత్, అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు ఈ ఏడాది మార్చిలో ప్రారంభమై ఇప్పటివరకు ఐదు విడతలుగా జరిగాయి. అయితే, కీలక అంశాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆరో విడత చర్చలు వాయిదా పడ్డాయి. ఈ ప్రతిష్టంభనకు ప్రధాన కారణం వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలన్న అమెరికా డిమాండే. ఈ డిమాండ్‌కు అంగీకరిస్తే దేశీయ రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళనతో భారత్ మొదటి నుంచి దీనిని వ్యతిరేకిస్తోంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం కావడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు.మరోవైపు, భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ రష్యానే భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. ఈ పరిణామాల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ఎగుమతులపై సుంకాలను గణనీయంగా పెంచారు. ఇదిలా ఉండగా, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, గణనీయమైన పురోగతి సాధించామని పీయూష్ గోయల్ వెల్లడించారు.

### ప్రపంచం సవాళ్లు ఎదుర్కొంటున్నా...

# 7.8 శాతం వృద్ధి సాధించాం

- మొదటి పేజీ తరువాయి

ఆర్థికంగా బలంగా నిలబడిందని అన్నారు.భారత్ ఇప్పుడు కేవలం బ్యాకెండ్ కార్యకలాపాలకు పరిమితం కాకుండా, సెమీకండక్టర్ల రూపకల్పన, తయారీ, ప్యాకేజింగ్ వరకు పూర్తిస్థాయి సామర్థ్యం గల దేశంగా ఎదుగుతోందని ప్రధాని మోదీ వివరించారు. "భారత్‌పై ప్రపంచానికి నమ్మకం ఉంది. అందుకే సెమీకండక్టర్ల భవిష్యత్తును ఇక్కడ నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నాయి" అని మోదీ అన్నారు.అమెరికా వంటి దేశాలు అనుసరిస్తున్న టారిఫ్ విధానాల వల్ల ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న గందరగోళం నేపథ్యంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల షాంఘై సహకార సంస్థ (%ాజూ%) సదస్సులో కూడా సభ్య దేశాలు ఏకపక్ష ఆర్థిక ఆంక్షలను వ్యతిరేకిస్తూ తీర్మానం చేశాయి. ఈ సదస్సులో మోదీతో పాటు చైనా, రష్యా అధ్యక్షులు కూడా పాల్గొన్నారు.సెమీకండక్టర్ల రంగంలో వేగానికి అత్యంత ప్రాధాన్యత ఉందని, అందుకే ప్రభుత్వం 'ఫైల్ నుంచి ఫ్యాక్టరీకి' పట్టే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తోందని మోదీ తెలిపారు. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులన్నీ ఒకే చోట లభించేలా 'నేషనల్ సింగిల్ విండో సిస్టమ్'ను అమలు చేస్తున్నామని, దీనివల్ల పెట్టుబడిదారులకు కాగితాల భారం తగ్గిందని వివరించారు. ఈ వృద్ధి పథంలోనే భారత్ త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ప్రజా ప్రయోజనాలకు సహకరించాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** జిల్లాలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ప్రజా ప్రయోజ నాలకుసంబంధించినపనులకు అన్నివర్గాల ప్రజలుతగినంతగా సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లో ఉన్న మినీ మీటింగ్ హాల్ లో తాడిపత్రి ప్రాంతానికి చెందిన పలువురురైతులతోకలిసిప్రత్యేక సమావేశాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో జరుగుతున్న ప్రజాహిత అభివృద్ధి పనులకు సంబంధించి రైతులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం తాడిపత్రి మండలం గన్నెవారిపల్లి గ్రామంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ నెం.159 పై ఉపరి వంతెన( ఫ్లై ఓవర్) బ్రిడ్జి నిర్మాణం పనులు జరగనున్న నేపథ్యంలో ప్రైవేటుభూములు కొనుగోలుఅవసరంఉన్నందున భూ సేకరణకు సంబంధించి ఆభూమి యజమానులు అయిన రైతులు పరిహారం చెల్లింపు విషయంలో సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రస్తుతం 3.79 ఎకరముల పట్టా భూమి భూసేకరణ చేయు నిమిత్తం ప్రభుత్వ నిబంధన ల మేరకు చట్టపరంగా న్యాయం చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ భూమి కేటగిరీ కి చెందిన 2.21 ఎకరముల భూములకు గాను 1 ఎకరాకు రూ. 38 లక్షలుగా సమావేశంలో పరిహారాన్ని నిర్ణయించి తీర్మానించారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా





## వైవియు భవనాలకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన

**కడప, పెన్ పవర్, సెప్టెంబర్ 2 :** యోగివేమన విశ్వవిద్యాలయం అకాడమిక్ బిల్డింగ్, ఆడిటోరియం, వెయిటింగ్ రూమ్ రిస్ట్ రూమ్ నిర్మాణాల శంకుస్థాపన శిలాఫలకాన్ని మానవ వనరుల అభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. పెండ్లిమర్రి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎం ఉష) రూ.10.5 కోట్లతో యోగివేమన విశ్వవిద్యాలయ భవన నిర్మాణాలు ప్రారంభ కార్యక్రమం యోగి వేమన విశ్వవిద్యాలయం. వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.

మంత్రి హాజరై జ్యోతి ప్రజ్వలన, శిలా ఫలకం ప్రారంబించారు. విశ్వవిద్యాలయ అవసరాలను వీసీ మంత్రి దృష్టికీ తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్

మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కమలాపురం ఎం.ఎల్.ఎ. పి.కృష్ణ చైతన్య రెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, రిజిస్ట్రర్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.జయరామిరెడ్డి, పి.ఎం ఉష విశ్వవిద్యాలయ సమన్వయకర్త డా తుమ్మల చంద్ర శేఖర్, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ చంద్రమతి శంకర్, మాదక్క, డీన్‌లు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్స్, అకడమిక్ కన్సల్టెంట్లు, పలువురు అధికారులు, బోధ నేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నగర సుందరీకరణ, రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ సెప్టెంబర్ 02 :** నగరంలో చేపడుతున్న సుందరీకరణ, రోడ్ల నిర్మాణ పనులను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. మంగళవారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల, విజ్ఞాన మందిర్, బంగారు పేట, మున్సిపల్ కార్యాలయం, సుంకేసుల రోడ్, తదితర ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ, రోడ్డు నిర్మాణం, సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సి క్యాంప్ నుండి విజ్ఞాన మందిర్ వరకు, విజ్ఞాన మందిర్ నుండి బి క్యాంప్ ఆటో స్టాండ్ వరకు జరుగుతున్న రోడ్ విస్తరణ పనులు, బంగారు పేట జంక్షన్ నుండి ఆర్ ఎస్ రోడ్ వరకు చేపడుతున్న కొత్త డివైడర్ నిర్మాణం, సుందరీకరణ పనులు, మదర్ థెరిసా సర్కిల్ నుండి ఘంటసాల సర్కిల్ వరకు జరుగుతున్న కొత్త డివైడర్ నిర్మాణం, సుందరీకరణ పనులు, సెయింట్ జోసెఫ్ కాలేజ్ నుంచి హిందూ స్మశాన వాటిక వరకు జరుగు తున్న రోడ్ విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి నిధులు మంజూరు చేసి ఇప్పటికి 6 నెలలు పూర్తి అయిందని, ఇప్పటికీ కూడా పనులు పూర్తి చేయకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పనులను సెప్టెంబర్ 30 వ తేది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యతగా కూడా చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..2025- 26 సంవత్సరానికి సంబంధించి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద నిధులు విడుదల కానున్నాయని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం మునగాలపాడు సర్కిల్ వద్ద, సంతోష్ నగర్ సర్వీస్ రోడ్ వద్ద ఉన్న పాట్ హోల్‌లను పూడ్చి, రోడ్ల మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ఎన్హెచ్ అధికారులను ఆదేశించారు. అనంతరం వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. వినాయక నిమజనం కార్యక్రమానికి సంబంధించి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర రెడ్డి, మున్సిపల్ కార్యాలయం ఎస్ఈ శేష సాయి, మున్సిపల్ ఇంజనీర్‌లు, నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధే బీజేపీ ప్రాధాన్యం : హరీష్ బాబు




తాడిమర్రి, పెన్ పవర్ సెప్టెంబర్ 02 : తాడిమర్రి మండలంలో మంగళవారం జరిగిన బీజేపీ మండల సమావేశంలో, రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, బీజేపీ మండల నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక మార్గదర్శకాలు అందజేశారు. ఈ సమావేశానికి మండల బీజేపీ అధ్యక్షుడు రాము అధ్యక్షత వహించగా, హరీష్ బాబు ప్రత్యేకంగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తవ్వడానికి మనందరం కృషి చేయాలి. ప్రజలకు నేరుగా లాభం చేకూరేలా ఆ పనులు పారదర్శకంగా కొనసాగాలని చూడాలి. ఏ ఏ గ్రామాల్లో ఏ సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి, పరిష్కార మార్గాలు సూచించడం బీజేపీ కార్యకర్తల ప్రధాన కర్తవ్యంగా భావించాలి. అలాగే, గ్రామస్థుల సమస్యలను సేకరించి, వాటిని మంత్రి కి నివేదించడం ద్వారా త్వరితగతిన పరిష్కారం సాధించాలన్నారు. ప్రతి కుటుంబానికి అభివృద్ధి సదుపాయాలను చేరవేయడం బీజేపీ లక్ష్యం అని హరీష్ బాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం తాడిమర్రి మండలం మర్రిమేకులపల్లి గ్రామానికి చెందిన పుల్లా నాయుదు మోకాళ్ల శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడంతో ప్రత్యేక కార్యక్రమం కూడా నిర్వహించారు. చాలా సంవత్సరాలుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ నడవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పుల్లా నాయుడు సమస్యను గుర్తించిన రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో, సంస్కృతి సేవా సమితి ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం పుల్లా నాయుడు తిరిగి పూర్తిగా ఆరోగ్యవంతంగా కోలుకోవడంతో, ఈ సందర్భంగా తాడిమర్రి మండలంలోని బీజేపీ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ తరపున హరీష్ బాబు ప్రత్యేక శుభాకాంక్షల లేఖను అందజేశారు. ఆ లేఖలో మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు ఇలా పేర్కొన్నారు. ప్రియమైన పుల్లా నాయుడుకి, మీరు బెంగళూరులోని వైదేహి ఆసుపత్రిలో మోకాళ్ల శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసుకుని సురక్షితంగా మీ ఇంటికి చేరుకున్నారని తెలిసి ఎంతో ఆనందంగా ఉంది.నా మీద నమ్మకంతో ధర్మవరం శాసనసభ్యుడిగా అవకాశం ఇచ్చిన మీలాంటి ప్రజలకు ఎంత సేవ చేసినా అది ఉడుతాభక్తి సాయమే. మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా, సంతోషంగా జీవించాలని నా హృదయపూర్వక ఆకాంక్ష. మా సంస్కృతి సేవా సమితి ఎల్లప్పుడూ మీకు వెన్నుదన్నుగా ఉంటుంది. సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందభరితమైన జీవితం గడపాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, జిల్లా కార్యదర్శి పోతులయ్య, మండల అధ్యక్షులు రామ్మోహన, మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయుడు, వైస్ ఎంపీపీ కృష్ణంరెడ్డి, వన్నూరు రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కడప జిల్లాకు అన్ని విధాల ప్రోత్సాహం

### - మంత్రి నారా లోకేశ్



**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** కడప జిల్లాలో విద్యా రంగం, మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక అభివృద్ధి కోసం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి మరియు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి , విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కి లేఖలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు కడప నియోజకవర్గంలోని పాఠశాలలకు మౌలిక వసతుల కోసం ఎస్ఎస్ఎ నిధుల మంజూరు, ఉర్దూ మీడియం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల సరఫరా, కడప ఐటీ పార్క్ అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు వంటి అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే కడప జిల్లా పారిశ్రామిక రంగంలో మార్పు కోసం ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వివిధ పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేస్తే, పరిశ్రమల విస్తరణతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలియజేశారు. కడపను ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు మరియు రెడ్డెప్పగారి మాధవి గారు-"విద్యా రంగ అభివృద్ధి, ఐటీ విస్తరణ, పరిశ్రమల ప్రోత్సాహం-ఈ మూడు అంశాల్లో కడప జిల్లా ముందంజలో ఉండాలని మా కృషి కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు.

## కొప్పర్తికి పరిశ్రమలు తీసుకువచ్చే బాధ్యత నాది

### పరిశ్రమదారులకు అండగా ఉంటాం : టెక్సానా మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ప్రారంభం అనంతరం మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి లోకేష్





**కొప్పర్తి పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం.. ఎన్డీయే, తెలుగుదేశం అని, మహిళలకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్ లో ప్రముఖ రెడీమేడ్ దుస్తుల తయారీ కంపెనీ టెక్సానా మాన్యుఫాక్చరింగ్ నూతన యూనిట్ ప్రారంభం అనంతరం అక్కడ పనిచేసే మహిళా సిబ్బందితో మంత్రి నారా లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇక్కడ ఎంతమందికి ఇది మొదటి ఉద్యోగం, రెండోది, మూడోదో చేతులు పైకి ఎత్తాలి. నా తొలి ఉద్యోగం బాగా గుర్తుంది. ఎండాకాలం సెలవుల్లో మూడు నెలలు పనిచేయాలని బాబు గారు చెప్పారు. ఇంటికి రానివ్వలేదు. అమెరికాలో జీఈ క్యాపిటల్ కంపెనీలో పనిచేశా. నా మొదటి బాస్ పేరు జాక్ అని కూడా గుర్తింది. జీవితంలో ఒకటి సాధించామని, సొంత కాళ్లపై నిలబడగలనని అప్పుడు అనిపించింది. పాదయాత్రలో 226 రోజులు పాటు 3,132 కి.మీలు నడిచా. చాలా మందిని కలిశా. ఎక్కడికి వెళ్లినా మాకు ఉద్యోగాలు కల్పించాలని అడిగారు. బాబు సూపర్ సిక్స్ లో మేం ఇచ్చిన తొలి హామీ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన. దీపం, తల్లికివందనం, స్త్రీ శక్తి లాంటి హామీలు ఇచ్చాం. గంగాధర నెల్లూరులో నేను యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు ఓ తల్లిని కలిశాను. తన భర్త తాగుడుకు బానిసై చనిపోయాడని, బజ్జీ కొట్టు నడుపుకుంటూ తన ఇద్దరు కుమారులను చదివించానని చెప్పారు. తమ కుమారులకు ఉద్యోగాలు కల్పిస్తే చాలని.. ఏమీ వద్దని ఆమె చెప్పారు. కియా ఫ్యాక్టరీ వద్ద ఫోటో దిగేందుకు వెళ్తుండగా.. ఓ చెల్లి వచ్చి నన్ను కలిసింది. కియా అనుబంధ విభాగాల్లో ఉద్యోగం చేస్తున్నానని, ఇప్పుడు తనకు నెలకు రూ.40వేల జీతం వస్తోందని చెప్పారు. గతంలో గృహిణిగా ఉండగా.. ప్రస్తుతం కుటుంబాన్ని తానే పోషిస్తున్నాని చెల్లి గర్వంగా చెప్పారు. చంద్రబాబు గారికి కృతజ్ఞతలు చెప్పాలని ఆమె కోరారు.

**మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం ఎన్డీయే, తెలుగుదేశం**

గాజులు తొడుక్కున్నావా, చీర కట్టుకున్నావా వంటి మాటలను విడనాడాలి. మహిళలు, పురుషులు సమానమని నమ్మే పార్టీ, ప్రభుత్వం ఎన్డీయే, తెలుగుదేశం. మహిళలను గౌరవించడం ఇంట్లోనే మొదలవుతుంది. చంద్రబాబు గారు 1992లో చిత్తూరు జిల్లాలో హెరిటేజ్ ను స్థాపించారు. సదరు కంపెనీని మా తల్లి భువనేశ్వరి గారు సమర్థంగా నడిపారు. అదే కంపెనీలో బ్రాహ్మణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పనిచేస్తున్నారు. ఇప్పుడు నేను రోడ్లపై తిరుగుతున్నానంటే కారణం నారా బ్రాహ్మణి. నా క్రెడిట్ కార్డు బిల్లును నా సతీమణి నారా బ్రాహ్మణి కడుతున్నారు. మార్పు మన ఇంట్లో మొదలవ్వాలని నేను తరువాయి 6లో..

## విద్యార్థుల ప్రమాదంపై తక్షణ స్పందన

## తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి సత్యకుమార్






**ధర్మవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 02 :** ధర్మవరం రూరల్ మండలం గొల్లపల్లి గ్రామం సమీ పంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం బాయ్స్ స్టోన్ పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడిన ఘటన మంగళవారం చోటుచేసు కుంది. ఈ ప్రమా దంలో ఐదుగురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు ధర్మవరం ఏరియా హాస్పిటల్‌కు తరలించబడ్డారు. ఈ సంఘటనపై సమాచారం తెలుసుకున్న మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు తక్షణమే హాస్పిటల్‌కు వెళ్లి గాయపడిన విద్యార్థులను పరా మర్శించారు. విద్యార్థుల పరిస్థితిని సమగ్రంగా తెలుసుకుని, వైద్య సిబ్బందితో చర్చించారు. అనంతరం ఆయన ఈ విషయం గురించి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి ఫోన్ ద్వారా తెలియ జేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ ఘటనపై వెంటనే స్పందించి, గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రులతో స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి వారిని పరామర్శించారు. తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, విద్యార్థులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలనే ఆదేశాలను ధర్మవరం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్‌కి ఇచ్చారు. మంత్రి అవసరమైతే ప్రత్యేక వైద్య నిపుణులను కూడా నియమించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం మా మొదటి ప్రాధాన్యం. ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా వారికి అత్యుత్తమ వైద్యం అందించాలి అని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా, హరీష్ బాబు హాస్పిటల్‌లో గాయపడిన విద్యార్థుల కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి, వారికి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే




**చిత్తూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 02 :** జిల్లాలో పాత అంబ్యులెన్స్‌ల స్థానంలో కొత్త అంబ్యులెన్స్ తీసుకువచ్చి ప్రజలకు అత్యవసర సేవలు అందించడం జరుగుతున్న దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం ప్రాంగణం లో కొత్త అంబ్యులెన్స్‌ను జిల్లా కలెక్టర్ మరియు చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్ మోహన్‌లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన ఆసుపత్రికి సంబంధించి పాత బడిన అంబ్యులెన్స్ ల స్థానంలో కొత్త అంబ్యులెన్స్‌ను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఐఓసిఎల్ ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాంసబిలిటీ కింద త్వరలో మరొక అంబ్యులెన్స్ రానున్నదని, దీనితో అంబ్యులెన్స్ ల సంఖ్య 3కు పెరుగుతుందన్నారు. అత్యవసర వైద్య చికిత్స మరియు రెఫరల్‌ల కొరకు వేలూర్, తిరుపతి లోని ఆసుపత్రులకు రోగులను సరియైన సమయంలో తీసుకువెళ్లాడానికి అంబ్యులెన్స్‌లు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ డా. సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

## అటల్ బిహారీ వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌లో మూడు రసవత్తర పోటీలు





**ధర్మవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** ధర్మవరం పట్టణంలోని ఆర్డిటి మైదానంలో మంగళవారం 14వ రోజు అటల్ బిహారీ వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్–2 పోటీలు అత్యంత రసవత్తరంగా, ఉత్కంఠభరితంగా సాగాయి. రోజంతా మూడు ఉత్కంఠభరితమైన మ్యాచులు జరగగా, ఆరు జట్లు తమ ప్రతిభను ప్రదర్శించాయి. అభిమానులను ఉత్కంఠకు గురిచేసిన ఈ పోటీల్లో ప్రతి జట్టు విజయాన్ని సాధించేందుకు విశేషంగా శ్రమించింది. మొదటి మ్యాచ్ రెబల్ స్టార్స్ మరియు వినాయక–లెవెన్స్ జట్ల మధ్య జరిగింది. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోరులో, రెబల్ స్టార్స్ జట్టు సమర్థవంతమైన బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శనతో 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెబల్ స్టార్స్ జట్టు ఆటగాడు నిరంజన్ అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకొని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందుకున్నాడు. రెండవ మ్యాచ్‌లో హిందూపురం హంటర్స్ మరియు దంపెట్ల కింగ్స్ జట్లు తలపడ్డాయి. శక్తివంతమైన బ్యాటింగ్ ప్రదర్శనతో హంటర్స్ జట్టు ఆధిపత్యం ప్రదర్శించి 43 పరుగుల తేడాతో గెలుపును కైవసం చేసుకుంది. హిందూపురం హంటర్స్ జట్టు ఆటగాడు అబుతలహ తన అద్భుతమైన ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రోజు చివరి మరియు మూడవ మ్యాచ్‌లో రామాపురం–లెవెన్స్ మరియు ఇండియన్ ఆర్మీ సోల్జర్స్ జట్లు తలపడ్డాయి. అద్భుతమైన బౌలింగ్, ఫీల్డింగ్ సమన్వయంతో ఇండియన్ ఆర్మీ సోల్జర్స్ జట్టు రామాపురం లెవెన్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ జట్టు తరపున మెరుపువేగంగా ఆడిన కిరణ్ విరాట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. రోజంతా జరిగిన ఈ పోటీల్లో విజేత ఆటగాళ్లకు ప్రత్యేక జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంలో మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, సీనియర్ క్రికెట్ ప్లేయర్లు మరియు ఇతర క్రీడాభిమానులు పాల్గొని ఆటగాళ్లను అభినందించారు. టోర్నమెంట్ సీజన్–2లో ప్రతి రోజు పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతూ అభిమానులకు మధురానుభూతిని అందిస్తున్నాయి. ఆటగాళ్ల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో ఈ టోర్నమెంట్ కీలకపాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## 13న జాతీయ లోక్ అదాలత్




**అనంతపురం పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి వారి ఆదేశాల మేరకు, అనంతపురము జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు ఆదేశాలతో ఈరోజు అనగా 02-09-2025 వ తేదిన న్యాయ సేవ సదన్, జిల్లా కోర్ట్ ఆవరణంలో అనంతపురము నందు జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ , అనంతపురం కార్యదర్శి ఎన్.రాజశేఖర్ గారు సెప్టెంబర్ 13 వ తేది జరుగు జాతీయ లోక్ అదాలత్ గురించి పోలీస్ శాఖల అధికారులతో సమిక్ష సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాస రావు, పోలీస్ శాఖ ఉన్నత అధికారులు, ఎక్సైజ్ ఉన్నత అధికారులు, మున్సిపల్ శాఖా అధికారులు, ఎలక్ట్రిసిటీ శాఖా అధికారులు హాజరు అయినారు. సెప్టెంబర్ 13వ తేది జరుగు జాతీయ లోక్ అదాలత్ లో రాజి కాబడిన క్రిమినల్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, , కొళాయి పన్ను కేసులు, ఇంటి పన్ను కేసులు అధిక సంఖ్యలో కేసులు రాజి చేయవలెనని సెప్టెంబర్ 13 వ తేది జరుగు జాతీయ లోక్ అదాలత్ ను దిగ్విజయం చేయవలెనని జిల్లా న్యాయ సేవ అదికార సంస్థ, అనంతపురం కార్యదర్శి ఎన్.రాజశేఖర్ గారు మరియు శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాస రావు కోరారు.

## ఒక ఆలోచన.... ఈ ప్రపంచాన్ని నడిపించేది ఎవరు?

### ప్రకృతి నియమాలను ఎవరూ తప్పించుకోలేరు : పెన్ పవర్ కృష్ణారెడ్డి



**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** విష్ణువు గరుత్మంతుడిని అధిరోహించి కైలాస పర్వతానికి వెళ్ళాడు. గరుత్మంతుడిని ద్వారం వద్ద వదిలి, శివుడిని కలవడానికి లోపలికి వెళ్ళాడు. గరుత్మంతుడు కైలాసపర్వత సౌందర్యాన్ని చూసి మంత్రముగ్ధుడయ్యాడు, అతని కళ్ళు అక్కడ ఉన్న ఒక అందమైన చిన్న పక్షిపై పడ్డాయి. పక్షి ఎంత అందంగా ఉందంటే, గరుత్మంతుని ఆలోచనలన్నీ దానివైపు లాగడం ప్రారంభించాయి. ఇంతలో యమధర్మరాజు కైలాసానికి వచ్చి, లోపలికి వెళ్ళే ముందు ఆ చిన్న పక్షిని ఆశ్చర్యంగా చూశాడు. గరుత్మంతునికి ఆ చూపులోని భావం అర్థం అయ్యింది, పక్షి అంతం దగ్గర పడిందని, కైలాస పర్వతం నుండి బయలుదేరినప్పుడు యమధర్మరాజు ఆ పక్షిని తనతో పాటు యమలోకానికి తీసుకువెళతాడని గ్రహించాడు. ఇంత చిన్నగా ఉన్న ఆ అందమైన పక్షి చనిపోవడం అంటే తట్టుకోలేకపోయాడు, ఆ పక్షి మీద జాలిపడ్డాడు. అందువల్ల ఆ పక్షిని పట్టుకుని వేల మైళ్ల దూరంలో ఉన్న అడవిలో ఒక రాతిపై వదిలి, కైలాసానికి తిరిగి వచ్చాడు.

యముడు బయటకు రాగానే గరుత్మంతుడు,"ఆ పక్షిని అంత ఆశ్చర్యంగా ఎందుకు చూశావు?", అనడిగాడు. యమధర్మరాజు ఇలా అన్నాడు, “గరుడా, కొన్ని క్షణాలలో, ఇక్కడకి వేల మైళ్ల దూరంలో ఉన్న ఒక పాము దానిని తింటుందని ఆ పక్షిని చూడగానే నాకు తెలిసింది, ఇంత త్వరగా ఇక్కడున్న పక్షి అక్కడకు ఎలా వెళ్తుందా అని నేను ఆశ్చర్యపోయాను, కానీ ఇప్పుడు అది ఇక్కడ లేదు అంటే పక్షి చనిపోయిఉండాలి.”

గరుత్మంతుడు అప్పుడు అర్థం చేసుకున్నాడు, “ ఎంత తెలివైన వాడైనా మృత్యువును నివారించలేడు.” అందుకే శ్రీకృష్ణపరమాత్మ ఇలా అంటారు

మీరు కోరుకున్నది మీరు చేస్తారు ... కానీ వాస్తవానికి నేను కోరుకున్నదే జరుగుతుంది. నేను కోరుకున్నది చేయండి ... అప్పుడు మీరు కోరుకున్నది జరుగుతుంది.

ఈ ప్రపంచం సాధ్యాసాధ్యాల ప్రపంచం. సాధ్యమయ్యే సంఘటన సాధ్యమవటానికి చాలా అవకాశం ఉంది, కానీ అత్యంత అద్భుతమైన విషయం ఏమిటంటే, అసాధ్యమైన సంఘటన సుసాధ్యమయ్యే అవకాశం కూడా అంతే ఉంది.

లాలాజీ
హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం
అనువాద బృందం ఆంధ్రప్రదేశ్

### ప్రభుత్వ సంక్షేమ పథకాలపై

# గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలి

### – జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి



**అనంతపురం, పెన్ పవర్ సెప్టెంబరు 02 :** స్వయం సహాయక సభ్యులు మరియు రైతు సంఘా సభ్యుల కు సుస్థిరమైన జీవనోపాధి,స్థిరమైన ఆదాయం వచ్చేలా ప్రైమరీ సెక్టార్ శాఖల అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ప్రోజెక్టు మేనేజర్ వి.లక్ష్మ నాయక్, పిడి డిఆర్డీఏ. శైలజ,జిల్లా వ్యవసాయ వ్యవసాయ అధికారిణి ఉమా మహేశ్వరమ్మ,పశుసంవర్ధక శాఖ జెడి,ఉద్యాన శాఖల అధికారుల తో కలసి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కన్వర్జెన్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సభ్యులైన మహిళలు మరియు రైతు సంఘా సభ్యులైన రైతుల కు సుస్థిరమైన జీవనోపాధి,స్థిరమైన ఆదాయం వచ్చేలా ప్రైమరీ సెక్టార్ శాఖల కు సంబంధించిన అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అములు పరిచే సంక్షేమ పథకాల పై పూర్తి అవగాహన కలిగి ఉండి, పట్టణ ప్రాంతాల్లో నే కాకుండా మారు మూల గ్రామాలకు వెళ్లి ప్రభుత్వము అములు పరుస్తున్న సంక్షేమ పథకాల పై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించినపుడే జిల్లా యంత్రాగం పై ప్రజలలో నమ్మకం కలుగుతుందన్నారు. ఎక్కడ కూడా బీడు భూమి ఉండ కూడదని అందులో ఎదో ఒక రకమైన పంట ఉండేలా సంబంధత అధికారు లు చర్యలు తీసుకోవాలని సూచించారు. బీడు భూమిలో ఉద్యాన పంటలు పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ వంటివి ఉండాలే తప్ప బీడు భూమి వుండకుదన్నారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న పథకాల పై మండలాల వారీగా, వివిధ రకాల ఉద్యాన పంటలు,డ్రిఫ్, పరిశ్రమల వంటి అంశాలపై విజయగాధలు తయారు చేసి మీడియా ద్వారా ప్రజలలోకి వెళ్ళితే దాని ద్వారా మిగిలి వారు కూడా పథకాలు ఉపయోగించుకుంటారని తెలిపారు.

జిల్లా అధికారులు కేర్ స్టడీ చేయాలని తెలిపారు. రైతులు ఏయే పంటలు వేశారు, పంటలు వేయని భూములో ఉద్యాన పంటలు, పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ ఏర్పాటు చేసుకునేలా డీఆర్డీఏ, పశుసంవర్ధక శాఖ, సమన్వయం చేసుకొని, ప్రతి కుటుంబానికి ఆదాయం వచ్చేలా ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రోజెక్టు మేనేజర్ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యాన,పశుసంవర్ధక,డి ఆర్ డి ఏ శాఖలు కొత్తగా ఎంపిక చేయబడిన గ్రామాలకు వార్షిక కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయడం జరుగుతుంద న్నారు. అనంతపురం జిల్లాలో 577 గ్రామ పంచాయతీలను కలుపుకొని 210 ఎన్ఎఫ్ క్లస్టర్‌లను ఏర్పాటు చేశారు మరియు రైతు సేవా కేంద్రాలను క్లస్టర్ ప్రధాన పరిగణనలోకి తీసుకోవడం జరిగిందన్నారు. డిఆర్డీఏ, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఉద్యానవన అధికారి, జిల్లా పశుసంవర్ధక మరియు ఇతర సంబంధిత అధికారులు స్వయం సహాయక సంఘాల ద్వారా సమిష్టి బయో ఇన్‌పుట్ తయారీతో పాటు రబీలో ఎన్ఎఫ్ పద్ధతులను పాటించేలా, 2025–2026 సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి రైతులు మరియు భూమిలేని వ్యవసాయ కార్మిక కుటుంబాలతో స్వయం సహాయక బృందాల సమావేశాలు నిర్వహించి, ప్రకృతి వ్యవసాయం చేపట్టడానికి ఆసక్తి ఉన్న రైతుల నమోదు, ఎన్ఎఫ్ మోడ్‌లోకి మారడానికి ఇష్టపడే వారి కోసం ఎన్ఎఫ్‌ప్రణాళికలను సిద్ధంచేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముదిగుబ్బ మండల బీజేపీ సమావేశం : హరీష్ బాబు





**ముదిగుబ్బ, పెన్ పవర్, సెప్టెంబర్ 02 :** ముదిగుబ్బ మండలంలో మంగళవారం జరిగిన బీజేపీ మండల సమావేశంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు బీజేపీ మండల నాయకులకు, కార్యకర్తలకు సమగ్ర మార్గదర్శకాలు అందజేశారు. ఈ సమావేశానికి ముదిగుబ్బ మండల బీజేపీ అధ్యక్షుడు అంజన్ రెడ్డి అధ్యక్షత వహించగా, అభివృద్ధి పై దిశానిర్దేశం చేయడానికి హరీష్ బాబు ప్రత్యేకంగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమం సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వాల సహకారంతో పలు ప్రాజెక్టులు ఇప్పటికే చేపట్టబడ్డాయి. ఈ ప్రాజెక్టుల ప్రయోజనాలు ప్రతి ఇంటికి చేరేలా ప్రతి బీజేపీ కార్యకర్త కృషి చేయాలి. గ్రామాల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి అని పేర్కొన్నారు. అలాగే, ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని సమయానుకూలంగా పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు.

ప్రజల అవసరాలను తెలుసుకుని, వాటిని ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదించి, సమగ్ర అభివృద్ధి సాధించే బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందని హరీష్ బాబు పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రామాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించి, ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయడంపై విస్తృతంగా చర్చ జరిగింది. అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలవడమే కాకుండా, వాటి ఫలితాలు ప్రతి కుటుంబానికి చేరేలా బీజేపీ నాయకులు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో బిజెపి సీనియర్ నాయకులు మాలపాటి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబులేసు, మండల అధ్యక్షులు అంజన్ రెడ్డి, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ గంగాధర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు ఫణిందర్ గౌడ్, రామ్మోహన, మండల ఉపాధ్యక్షులు చిన్నకోట్ల చంద్ర, గడ్డం ఓబిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కర్నూలు జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఈగా నియమింపబడిన మనోహర్ జిల్లా కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. చిత్రంలో ప్రస్తుత ఎస్ఈ నాగేశ్వర రావు ఉన్నారు.


## బొప్పాయి పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం ,పెన్ పవర్ ఆగస్టు 2 :** కూడేరు మండలం కమ్మూరు గ్రామశివారులోఉన్నబొప్పాయి పంట తోటను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వి.ఐఏఎస్ ఉద్యాన శాఖ అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షంలోనే 8 ఎకరాలలో సాగు చేసిన బొప్పాయి పంట తోటను సందర్శించి బొప్పాయి మార్కెటింగ్ విషయాలతో పాటు పంట సాగు చేసిన రైతుల ప్రస్తుత ఆర్థిక వాస్తవ స్థితిగతుల గురించి రైతులతో జిల్లా కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. ముఖ్యంగా ఓబయ్య అనే రైతు సాగు చేసిన బొప్పాయి పంట ధర రేటు తక్కువగా ఉండడానికి కారణాలను తెలపాలన్నారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ అన్నిచోట్ల వర్షాల ప్రభావం అధికంగా ఉండడం వల్ల వ్యాపారులు బొప్పాయి కొనుగోలు చేయడం లేదని అలాగే ఉత్పత్తి కూడా ఎక్కువగా ఉన్న కారణంగా ఆశించిన మేరకు ధర రేటు లభించడం లేదని రైతు ఓబయ్య కలెక్టర్‌కు తెలిపారు. సీజన్ సమయంలో ఢిల్లీ ఆగ్రా కలకత్తా బొంబాయి చెన్నై వరకు కూడా మార్కెటింగ్ సదుపాయాలు ఉండేవని ప్రస్తుతం వర్షాకాలంలో ఈ పంట రైతులు నష్టపోవాల్సి వస్తున్నదని రైతు ఓబయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జిల్లాకలెక్టర్ స్పందిస్తూ బొప్పాయి పంట సాగుకు మంచి మార్కెట్ సౌకర్యం కల్పించేవిధంగాప్రత్యామ్నాయ చర్యలను ప్రణాళికా బద్ధంగా తీసుకుంటామని అన్ని విధాల ప్రభుత్వపరంగా ఆదుకునే విధంగా తనవంతుగా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఆ రైతుకు ఆత్మవిశ్వాసం కల్పించి భరోసా ఇచ్చారు. అనంతరం ఉద్యాన శాఖ అధికారులతో త్వరలో ఈ విషయమై సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకునే విధంగా నిర్ణయిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, ఏపీ డి ధనుంజయ, మండల తాసిల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో కుల్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 13 న లోక్ అదాలత్

### – డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి



**చిత్తూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 02 :** రాజీ మార్గమే రాజమార్గంగా సెప్టెంబర్ 13 న లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు లోని డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ తన ఛాంబర్ నందు ఈ నెల 13 న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమం పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఎస్ఏ సెక్రటరీ మాట్లాడుతూ రాజీ మార్గమే రాజా మార్గంగా గుర్తించి జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవడానికి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చాలా కాలంగా పరిష్కారం కానీ అనేక కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోచ్చన్నారు. భావోద్వేగాలు, క్షణిక కాలం లో చేసే తప్పుల పై నమోదైన కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చునారు. బ్యాంక్ కేసులు, ఆక్సిడెంట్లు, ఇన్సూరెన్స్ కేసులు, వివాహ సంబంధ కేసులు, సివిల్ మరియు చిన్న పాటి క్రిమినల్ కేసు లకు సత్వర న్యాయం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ ఇప్పించి రాజీ అనంతరం కేసు కొట్టివేయడం జరుగుతుందన్నారు. ఈ కేసులకు అప్పీలు ఉండదన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కోర్టు సమయం తో పాటు కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. మండల మరియు జిల్లా స్థాయిలో ప్రతి రోజూ లోక్ అదాలత్ కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

# పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరగాలి : కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, పెన్ పవర్ సెప్టెంబర్ 02 :** గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా జరగాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వర్షాకాల పరిశుభ్రత, ఉపాధి హామీ, యూరియా లభ్యత,పి 4 పాలసీ, అన్నదాత సుఖీభవ, ఐవిఆర్ఎస్ తదితర అంశాలపై మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెద్ద హరివాణం, హొళగుంద మండలాల్లో 2023, 2024, 2025 వరుసగా 3 సంవత్సరాలు పాటు డయేరియా కేసులు రావడానికి గల కారణాలను కలెక్టర్ ఎంపిడిఓ, ఈఓఆర్డి, మెడికల్ ఆఫీసర్ లను ప్రశ్నించారు?? పారిశుధ్యం పనులు సక్రమంగా నిర్వహిస్తున్నారా? ఓవర్ హెడ్ ట్యాంక్ లను శుభ్రం చేయిస్తున్నారా? అని కలెక్టర్ ఎంపిడిఓ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లను ప్రశ్నించారు??? సంబంధిత గ్రామాలకు వెళ్లి నీటి శాంపిల్ చెక్ చేసి డయేరియా కేసులు రావడానికి గల కారణాలను వెరిఫై చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్ ను ఆదేశించారు.... 2025 సంవత్సరంలో హొస్పేనాపురం, మంత్రాలయం లో కేసులు నమోదు అవడానికి గల కారణాలు ఏంటని కలెక్టర్ ఎంపిడిఓ, ఈఓఆర్డి, మెడికల్ ఆఫీసర్ లను ప్రశ్నించారు గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగాలని, ఓవర్ హెడ్ ట్యాంక్ లను శుభ్రం చేయించాలని కలెక్టర్ ఎంపిడిఓ, ఈఓఆర్డి లను, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లనుఆదేశించారు. లియూరియా బ్లాక్ మార్కెట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. యూరియా కు సంబంధించి జిల్లాలో ప్రస్తుతం యూరియా 1329 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు మరియు పిఎసిఎస్‌లో అందుబాటులో ఉందన్నారు. అదే విధంగా మరో 3500 మెట్రిక్ టన్నులు యూరియా కూడా వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఎవరెవరికి ఎంత యూరియా ఇచ్చింది డేటా తీసుకొని అప్లోడ్ చేయాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.. అదే విధంగా నానో యూరియా ని కూడా వాడాలని రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.. అవసరం మేరకు మాత్రమే యూరియా తీసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శనివారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని, ఇందులో భాగంగా 80 మంది ప్రత్యేక అధికారులు ఏదో ఒక మండలానికి విచ్చేసి, 3 గ్రామాలను ఆకస్మిక తనిఖీ చేస్తారన్నారు.. మొదటగా స్కూల్లో ప్రార్థనకు హాజరై అక్కడనుండి గ్రామంలోని గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, హెల్త్ సెంటర్లు, రేషన్ షాపులు, అంగన్వాడి కేంద్రాలు, త్రాగు నీరు, పారిశుధ్యం పనులు, వసతి గృహాలు మొదలగు ప్రదేశాలను సందర్శించి, పరిశీలిస్తారన్నారు.. వారు పరిశీలించిన వాటిలో ఏదైనా ఒక అంశంలో అయిన నెగెటివ్ రిపోర్టు ఇచ్చినట్లయితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా వారి పరిశీలించిన వాటిని ప్రొఫార్మాలో ఎంట్రీ చేసి ఆన్లైన్ పోర్టల్‌లో కూడా ఎంట్రీ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా కూలీలకు పనులు కల్పించడంలో ఇప్పటివరకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు..ప్రస్తుతం వర్షాలు రావడం వల్ల అంతగా పనులు జరగలేదని, వర్షాలు తగ్గిం తర్వాత పనుల కల్పనపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సగటు వేతన రేటు కల్పించడంలో కూడా ప్రగతి సాధించాలని, ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సంబంధిత మండలాల ఎంపిడిఓ లను ఆదేశించారు. జల్ సంచయ్ జన్ బాగీదరి పథకం లో భాగంగా 2023- 24, 2024- 25, 2025- 26 ఆర్థిక సంవత్సరాల్లో చేపట్టిన డీసిల్టింగ్, నీటి సంరక్షణ, సోక్ పిట్స్, ఫారం పాండ్స్ తదితర జల సంరక్షణ పనులకు సంబంధించి జరుగుతున్న పనులను, పూర్తైన పనుల ఫోటో లను ఆన్లైన్ లో అప్లోడ్ చేయించాలని కలెక్టర్ డ్వామా పిడి ని ఆదేశించారు.. హార్టికల్చర్ ప్లాంటేషన్ కి సంబంధించి 4 వేల 248 ఎకరాలకు శాంక్షన్ లు ఇచ్చామని, 3 వేల 601 ఎకరాలలో ప్లాంటేషన్ పూర్తి చేశారన్నారు.. పెండింగ్ లో ఉన్న ప్లాంటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. పి4 పాలసీ కి సంబంధించి మొదటిలో 60 వేల బంగారు కుటుంబాలు గుర్తించారని, నీడ్ అసెస్మెంట్ సర్వే లో కొత్తగా అదనంగా 30 వేల బంగారు కుటుంబాలను యాడ్ చేశారన్నారు.. వాటిని వెరిఫై చేయాలని కలెక్టర్ మండలాల ఎంపిడిఓ లను ఆదేశించారు.

## 2బి బార్ నిర్వహణకు లాటరీ..



**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** రాజ శ్రీ కమిషనర్, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్, ఏపి, మంగళగిరి వారి ఆదేశాల మేరకు ఈరోజు (మంగళవారం) గౌరవనీయులైన జిల్లా కలెక్టర్&మేజిస్ట్రేట్ సమక్షంలో, వైఎస్ఆర్ కడప జిల్లా వారి ఆధ్వర్యం లో 2025–28 సంవత్సరానికి 2బి బార్ ఓపెన్ కేటగిరీకి రినోటిఫై చేయబడిన బార్ కీ లాటరీ నిర్వహించారు.

కడప స్టేషన్: – రీనోటిఫై చేయబడిన బార్లలో 01 బార్ కీ లాటరీ నిర్వవహించి విశ్వనాథ రెడ్డి అను దరఖాస్తు దారునికి కేటాయించడమైనది.

ఈ సమావేశములో గౌరవనీయులైన డిప్యూటీ కమీషనర్, కడప జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్, వైఎస్ఆర్ కడప మరియు కృష్ణకుమార్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, విశ్వనాథ రెడ్డి ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే లక్ష్యం అవసరం... స్వచ్ఛమైన గాలి నీ వైపే...

పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS

**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** మన కొక లక్ష్యం తప్పనిసరిగా ఉండాలి. మనం అత్యంత స్వాభావికమైన పద్ధతి లో ఆ ధ్యేయాన్ని సాధించ డానికి ప్రయత్నించాలి. సాక్షా త్కార ప్రాప్తికి ఎన్నో పద్ధతులు న్నాయి. ప్రతి పద్ధతిలోనూ మనకు అత్యుత్తమ విధానం ఏదో పరిశీలించి తెలుసు కోవడం మన ధర్మం. తమ జీవిత మర్మాన్ని ఛేదించు కోవడానికి ఏవిధానం సరైనదోనన్న నిశ్చయం ఆయా వ్యక్తుల నిర్ణయాలపై, ఆపరమాత్మ కృపపైన ఆధారపడి ఉంటుంది. మానవుని ఆలోచనా శక్తి పరమాత్మకు అత్యంత సన్నిహితమైనదనే సంగతి అందరూ అంగీకరించేదే. మన ఆలోచనలు ప్రతిచర్యలవల్లనే మనకు ప్రస్తుత క్షీణస్థితి కలిగింది. అదే ఆలోచనలు సహాయంతోనే మన వికాసం జరుగగలదు. వాటిని మనం దైవకార్యానికి వినియోగిస్తే అవి మనలను మనం చిట్టచివరి లక్ష్యానికి దగ్గరగా చేరుస్తాయి. నీ లక్ష్యం నీ యెదుటే ఉందంటే , నీకు తాజాదనం అందించి నీవు మరింత ముందుకు పోగలిగేటట్లు నిన్ను తయారుచేయగల స్వచ్ఛమైన గాలి నీవైపే వీస్తున్నదని దాని అర్థం. తన లక్ష్యాన్ని ఎప్పుడు సాధించగలమని అని మనస్సులో తపన ఉన్న వ్యక్తి ఆమార్గంలో ప్రవేశించగానే, ఆ తరువాత స్థితులు వాటంతటవే అతనిని అనుసరిస్తాయి. కేవలం ఒకేలక్ష్యం ఉండాలి.అప్పుడు వివిధమైన ధ్యేయాలకు, వివిధ మార్గాల అవసరం కలుగదు.

## రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కి సాదర వీడ్కోలు





**కడప, పెన్ పవర్ సెప్టెంబర్ 02 :** వైయస్సార్ కడప జిల్లాలో సెప్టెంబర్ 2వ తేదీ జిల్లా పర్యటన ను ముగించుకొని కడప విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానం లో మంగళ వారం రాత్రి 7.40 గం.లకు తిరుగు ప్రయాణమైన రాష్ట్ర విద్యా,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గారికి సాదర వీడ్కోలు లభించింది. రాష్ట్ర విద్యా,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కి కడప విమానాశ్రయంలో వీడ్కోలు పలికిన రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జీ.భరత్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్.పి ఈజీ అశోక్ కుమార్,కడప,కమలాపురం శాసన సభ్యులు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఎం ఎల్ సి రాం భూపాల్ రెడ్డి,కడప,జమ్మల మడుగు ఆర్ డి ఓ లు జాన్ ఎర్విన్, సాయి శ్రీ ,నాయకులు రెడ్డప్ప గారి శ్రీనివాసుల రెడ్డి,భూపేష్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు.

## పాడిరైతులలబ్ధిదారులఎంపికపారదర్శకంగా నిర్వహించాలి


### – జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు,పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** జిల్లాలోని పాడి రైతులకు విరివిగా రుణాల అందజేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోనే ప్రత్యేక సమావేశం మందిరములో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు రుణాలు అందజేయడంలో లబ్ధిదారులు ఎంపిక పై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఇన్చార్జి జెడి ఆరిఫ్, పశుసంవర్ధక శాఖ డాక్టర్లు, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల జీవనోపాధి,స్థిరమైన ఆదాయం వచ్చేలా పశుసంవర్ధక శాఖల అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. తమ శాఖల ద్వారా అమలు పరిచే సంక్షేమ పథకాల పై పూర్తి అవగాహన కలిగి ఉండి, పట్టణ ప్రాంతాల్లో నే కాకుండా మారు మూల గ్రామాలకు వెళ్లి ప్రభుత్వము అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తిఅవగాహనకలిగించినపుడే జిల్లా యంత్రాగం పై ప్రజలలో నమ్మకం కలుగుతుందన్నారు. పశు సంవర్ధక శాఖ ఏడి ల ద్వారా వారి పరిధిలో ఉన్న రైతుల్లో పాడి పరిశ్రమ మరియు పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేయాలని అందుకు అనుగుణంగా అవసరమైన ఆర్థిక సాయం అందించడానికి చర్యలుచేపట్టడంజరుగుతుందని తెలిపారు రైతులతో ప్రత్యక్షంగాను, సంబంధం కలిగి ఉండాలని పశు సంవర్ధక అధికారులను ఆదేశించారు, పాడిపైన ఆసక్తి కలిగి ఉన్న రైతులు జాబితా సిద్ధం చేయాలనిసంబంధితఅధికారులను ఆదేశించారు, ఒక్క పాడి ఆవు ఉన్న రైతులను గుర్తించాలి, అలాగే రెండు పాడి ఆవులు రైతులను గుర్తించాలి సమగ్ర నివేదికను తయారుచేసి సంబంధిత ఆయా మండలాల ప్రధాన కేంద్రాలలో ఉన్న బ్యాంక్ మేనేజర్లతో పాడి రైతుల రుణ సౌకర్యంపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు జాబితాలో ఉన్న రైతులు అర్హత పొందిన రైతులను జాబితా సిద్ధం చేయాలని, వివిధ కారణాల వలన పాడి రైతులు తిరస్కరణకు గురైన వివరాలతో కూడిన జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు, మీకు ఎలాంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకొని రావాలని ఆదేశించారు జిల్లాలో ఇప్పటికే ఏడు కోట్ల రూపాయలు పాడి రైతులకు అందజేయడం జరిగిందని తెలిపారు ఇంకను పాడు రైతుల ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతూ ఉందని తెలిపారు, బ్యాంక్ అధికారులు పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయవలసిన బాధ్యత మన అందరి పై ఉన్నదని తెలిపారు. జిల్లాస్థాయిలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కమిటీకి సంబంధించిన ఇది రెండవ సమావేశం అని ప్రతిపాదనలను సిద్ధం చేసి అందజేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎల్ డి ఎం మీ తరుణ్ కుమార్, 32 మండలాల పశు సంవర్ధక శాఖ సిబ్బంది, డాక్టర్లు, వివిధ బ్యాంకుల తదితరులు పాల్గొన్నారు.

## దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్సార్ కు ఘన నివాళి





**గంగవరం, పెన్ పవర్ ,సెప్టెంబర్ 2 :** పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, గిరిజన ప్రాంతా అభివృద్ధికి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎంతో కృషి చేశారని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి ,జడ్పిటిసి బేబీ రత్నం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యెజ్జు వెంకటేశ్వరరావు కొనియాడారు. మంగళవారం స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో పేద ప్రజలు సంక్షేమానికి రాజశేఖర్ రెడ్డి కృషి చేశారన్నారు.

జడ్పిటిసి బేబీ రత్నం మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి రాజశేఖర్ రెడ్డి ఎనలేని సేవలు అందించారన్నారు. అలాగే ప్రజలకు విద్య వైద్యం అందించడంలో విశేషమైన కృషి చేశారన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు పేద ప్రజలకు అందించారు. రంపచోడవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడం జరిగింది అన్నారు. ఈ ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కే గంగాదేవి, సర్పంచులు రామలక్ష్మి, మరిదమ్మ కామరాజు, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు పాయం వెంకటేశ్వర్లు, సంకురు దొర పార్టీ నాయకులు అప్పారావు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణారెడ్డి, వై రామకృష్ణ , చిట్టిబాబు, మడకం చంద్రావు, చిన్నాలదొర, తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో :** రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పిడతమామిడిలో జరిగాయి. నియోజవర్గ నాయకుడు గొంప కొండబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి డాక్టర్ వైఎస్ఆర్ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ,కాంగ్రెస్ నాయకులు పెద్ద, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

## కడప పట్టణంలో జీసస్ సస్టైన్ ఆర్గనైజేషన్ ఫర్ సీకర్స్ హెూమ్ను విజిట్



కడప పెన్ పవర్ సెప్టెంబర్ 2 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప పట్టణం ప్రకాష్ నగర్ లో గల జీసస్ సస్టైన్ ఆర్గనైజేషన్ ఫర్ సీకర్స్ హెూమ్ను విజిట్ చేసి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వంటశాలను, వసతి గదులను, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ



సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిల్లల విద్యా , ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి. పిల్లలు ఏ ఏ తరగతులను అభ్యసిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ఓం నిర్వాహకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం

### మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్...



**మైదుకూరు పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** రైతుల పక్షపాతి, రైతు బాంధవుడు, పుట్టా సుధాకర్ యాదవ్ పట్టు వదలని విక్రమార్కుడిలా అలగనూరు రిజర్వాయర్ను పూర్తి చేయాలన్న సంకల్పంతో ముందడుగు. కేసీ కెనాల్ పరిధిలో 92,000 ఎకరాల ఆయకట్టుకు త్రాగు, సాగునీరు అందించే అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మరమ్మతులకు నిధులు మంజూరు చేసేలా ఆర్థిక శాఖకు సూచనలు ఇవ్వాలని అభ్యర్థించిన ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్. కడప రైతుల ఇరుకారు పంట కలను సహకారం చేసేందుకు పుట్టా సుధాకర్ యాదవ్ లోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సీఎం చంద్రబాబు మైదుకూరులో రాజోలి ఆనకట్ట నిర్మిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు..

రాజోలు ఆనకట్టను పూర్తి చేయాలంటే ఆర్థిక భారంతో కూడుకున్న పని.. రాజోలుకు ప్రత్యామ్నాయంగా ప్రత్యామ్నయ పరిష్కారంలో భాగంగా అలగనూరు రిజర్వాయర్ ను అనేక మంది నీటి పారుదల శాఖ అధికారుల పరిశీలన అనంతరం గుర్తించాము. 2.965 టిఎంసిల సామర్థ్యం గల అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వైఎస్ఆర్ కడప జిల్లాకు త్రాగు,సాగునీరును అందిస్తుంది. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటి నిల్వ చేయడానికి మాత్రమే ఉపయోగపడే ప్రాజెక్ట్.. 2019లో భారీ వర్షాల కారణంగా కట్ట తెగి తీవ్ర నష్టం వాటిల్లడంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తిగా ఆగిపోయింది. ఈ రిజర్వాయర్ మరమ్మతులు పూర్తయితే మైదుకూరు నియోజకవర్గం మరియు కడప జిల్లాలో 92 వేల ఎకరాల ఆయకట్టు ఇరుకారు పండించేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా రైతులకు సంవత్సరానికి 250 కోట్ల రూపాయల లాభం వచ్చే అవకాశం ఉంది. నీటిపారుదల శాఖకు 36 కోట్ల రూపాయలతో మరమ్మత్తు అంచనా తయారుచేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది ఆర్థిక శాఖ ఆమోదం కోసం ఉంది. నిధులు మంజూరు చేసి త్వరితగతిన ప్రాజెక్టు పూర్తయ్యాలా ఆదేశాలు ఇవ్వాలని నారా లోకేష్ గారిని కోరిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్.సానుకూలంగా స్పందించి అలగనూరు ప్రాజెక్టు పూర్తి అయ్యేందుకు అవసరమయ్యే నిధులు మంజూరుకు త్వరితగతిన కృషి చేస్తా అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు హామీ ఇచ్చిన నారా లోకేష్.

## ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 2 :** జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా నిర్వహించారు .నాయకులు కార్యకర్తలు వీర మహిళ భూముల విశాలాక్షి కూటమి నాయకులు మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ పాల్గొని భారీ కేకను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు .అనంతరం మర్రిపాలెం గ్రామంలో కూడా జనసేన అధినేత పుట్టినరోజు వేడుకలు వర్షంలో కూడా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన వీర మహిళ భూముల విశాలాక్షి మాజీ ఎంపీపీ తీగల ప్రభ సత్యవేణి గణేష్ నాగు ప్రసాద్ కందల శివ తదితరులు పాల్గొన్నారు.

## కడప ప్రకాష్ నగర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సమీకృత వెనుకబడిన తరగతుల బాలుర వసతి సముదాయము విజిట్

### – న్యాయ విజ్ఞాన సదస్సు






**కడప పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు కడప పట్టణం ప్రకాష్ నగర్ లో గల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము సమీకృత వెనుకబడిన తరగతుల బాలుర వసతి సముదాయమును విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వంటశాలను, వసతి గదులను, టాయిలెట్లను, స్టోర్ రూమును పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిల్లల విద్యా , ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి. పిల్లలు ఏ ఏ తరగతులను అభ్యసిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో అంకురార్పణతో..పవిత్రోత్సవాలు







**తిరుపతి పెన్ పవర్ సెప్టెంబర్ 2 :** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో సెప్టెంబరు 03 నుండి 05వ తేదీ వరకు జరుగనున్న పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు.ఈ సందర్భంగా ఉదయం ఆచార్య రుత్విక్‌వరణంలో భాగంగా ఋత్వికులకు విధులు కేటాయించి వస్త్రసమర్పణ చేశారు. సాయంత్రం ఆలయ విమాన ప్రాకారం చుట్టూ సేనాధిపతివారిని ఊరేగింపు నిర్వహించారు. ఆ తరువాత యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టారు. పవిత్రోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 03న పవిత్రప్రతిష్ట చేపడుతారు. ఉదయం 09 – 11 గం.ల వరకు యాగశాలలో అకల్మష ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన మరియు స్నపన తిరుమంజమునకు ఏర్పాట్లు చేపడుతారు. ఉదయం 11 గం.ల నుండి 12.30 గం.ల వరకు కల్యాణ మండపమునందు స్నపన తిరుమంజనం, సేవాకాలము, శాత్తుమొర ఆస్థానం చేపడుతారు. సాయంత్రం ఉత్సవ మూర్తులు తిరువీధి ఉత్సవం, రాత్రి 7.30 – 9.00 గం.ల వరకు యాగశాల వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. సెప్టెంబరు 04వ తేదీ స్నపన తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం, జాప్యం, మూలవర్లకు, ఉత్సవర్లకు, ఉపసన్నిధి నందు పవిత్ర సమర్పణ, విమాన ప్రాకారం, ధ్వజస్తంభం మరియు మాడ వీధులు, శ్రీ మఠం ఆంజనేయ స్వామి వారి ఆలయం వరకు తిరువీధి ఉత్సవం చేపడుతారు. సాయంత్రం 5.30 – 6.30 గం.ల మధ్య ఉత్సవ మూర్తులకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. సెప్టెంబర్ 05వ తేదీ ఉదయం స్నపన తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం, సాయంత్రం ఉత్సవ మూర్తులకు తిరువీధి ఉత్సవం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి, ప్రబంధ శాత్తుమొర , వేద శాత్తుమొర చేపడుతారు. రాత్రి ఉత్సవ మూర్తులు కుంభం విమాన ప్రదక్షిణంగా సన్నిధిగా వేంచేపు చేస్తారు. పవిత్రోత్సవాలలో పాల్గొనే భక్తులు రూ. 500/– చెల్లించి ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. ఒక టికెట్టుపై ఇద్దరికి ప్రవేశం ఉంటుంది, ఒక పవిత్ర ప్రసాదం ఇవ్వబడుతుంది. శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయంగార్లు, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, ఏఈఓ శ్రీ ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ లు శ్రీ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ ఇతర అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# రాజ్‌తో సమంత ప్రేమాయణం.. బయటపడ్డ దుబాయ్ వీడియో..!



**హైదరాబాద్ పెన్ పవర్:** క్యూట్ బ్యూటీ సమంత రూత్ ప్రభు మరో సారి వార్తల్లో నిలిచారు. దుబాయ్ ఫ్యాషన్ వీక్ పాల్గొని ఫుల్ ఎంజాయ్ చేస్తున్న వీడియో ఒకటి తన ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది. అయితే ట్రిప్ లో ఓ వ్యక్తి చేయి పట్టుకుని ఉన్న ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా వైరల్ గా మారింది. అభిమానులకు అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. ఆ చేతిని చూసి అది 'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ దర్శకుడు రాజ్ నిడిమోరుదేనని నెటిజన్లు కనిపెట్టారు. ఈ వీడియో ఉన్నది ఎవరో మాకు కావాల్సిన కన్ఫర్మేషన్ అంటూ కామెంట్ల వర్షం కురిపించారు.

### కొత్త పార్టనర్ ను పరిచయం చేస్తున్నారా?..

అయితే ఈ వీడియోలో వారి ముఖాలు స్పష్టంగా కనిపించలేదు. కానీ రాజ్ చేతికి ఉన్న బ్రాస్‌లెట్ గతంలో ఆయన ధరించిన బ్రాస్‌లెట్ ఒకటే అని అభిమానులు ఈ నిర్ణయానికి వచ్చారు. మీరు మీ కొత్త పార్టనర్ ను పరిచయం చేస్తున్నారా.. ? కన్ఫర్మేషన్ ఇవ్వండి.. మీరు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నాం .. అంటూ పోస్ట్ చేస్తున్నారు అభిమానులు. అంతే కాకుండా సమంత పోస్ట్ చేసిన వీడియోకు, ఆమె 'సిటాడెల్' కో-స్టార్ వరుణ్ ధావన్ హార్ట్ ఎమోజీని పోస్ట్ చేయడంతో మరింత ఆసక్తి నెలకొంది.

### రాజ్- సమంత బంధంపై ఊహాగానాలు..

రాజ్, డీకే కృష్ణన్ దర్శకత్వంలో రూపొందిన 'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ తర్వాత సమంత, రాజ్ ఇద్దరూ అనేక సందర్భాల్లో కలిసి కనిపించారు. దీనితో వీరి సంబంధంపై పలు ఊహాగానాలు మొదలయ్యాయి. చాలా మంది అభిమానులు, సమంత తన ప్రేమ జీవితాన్ని నెమ్మదిగా పబ్లిక్‌గా పరిచయం చేస్తోందని అభిప్రాయపడుతున్నారు. అయితే, సమంత గానీ, రాజ్ గానీ ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 'సిటాడెల్' వెబ్ సిరీస్ ఇండియన్ స్పిన్-ఆఫ్‌లో కలిసి పనిచేసినప్పటి నుండి వీరిద్దరూ మరింత దగ్గరయ్యారని సినీ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.

### సమంత కొత్త రూల్స్

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకు నేను చాలా సినిమాలు, వెబ్ సిరీస్‌లలో భాగమయ్యాను. కానీ, అవన్నీ నాకు ఇష్టమైనవి కావు. కానీ ఇప్పుడు నేను చేసే ప్రతి పని, నేను పెట్టుబడి పెట్టే ప్రతి వ్యాపారం, నేను నిర్మించే ప్రతి సినిమా నా మనసుకు నచ్చినవి అని తెలిపింది. ఒకేసారి ఐదు సినిమాలు చేయలేను. అందుకే నేను చేసే పనిని తగ్గించాను. కానీ ఇప్పుడు చేసే ప్రతి పనికీ, నేను పెట్టే ప్రతి శ్రమకి ఎంతో విలువ ఉందని చెప్పుకొచ్చింది.

వృత్తిపరంగా సమంత తన కంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుని ముందుకు సాగుతోంది. ఇటీవల 'శుభం' సినిమాలో అతిథి పాత్రలో నటించింది. ఈ చిత్రాన్ని ఆమె స్వయంగా నిర్మించారు. ప్రస్తుతం ఆదిత్య రాయ్ కపూర్ తో కలిసి 'రక్త బ్రహ్మాండ్ : ది బ్లడీ కింగ్ డమ్ ' అనే వెబ్ సిరీస్ లో నటిస్తోంది. ఇందులో వామికా గబ్బి, అలీ ఫజల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అయితే సమంత తన ప్రేమ జీవితం గురించి అధికారికంగా ప్రకటించకపోయినా.. ఆమె అభిమానులు మాత్రం ఆ శుభవార్త కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరి రాజ్ తో తన బంధాన్ని ఎప్పుడు బయటపెడుతుందో వేచి చూడాలి.

# కాళేశ్వరం ఎఫెక్ట్: సర్కారు ముందున్న ఆప్షనేంటి?



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని.. లక్ష కోట్ల రూపాయలకు పైగానే దోచుకున్నారని ఆరోపిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై సీబీఐకి ఆదేశించారు. అయితే.. అసలు కమిషన్ రిపోర్టుపైనే సందేహా లు ఉన్నప్పుడు.. దీని ఆధారంగా విచారణకు ఆదేశించడం సరికాదని పేర్కొంటూ హైకోర్టు దీనిని తోసిపు చ్చింది. ఈ క్రమంలో సర్కారు ముందున్న ఆప్షన్లు ఏంటి? ఏం చేయాలి? అనేది ఆసక్తిగా మారింది. ప్రస్తుతం సర్కారుకు రెండు ఆప్షన్లు కనిపిస్తున్నాయి. 1) ఎన్డీఎస్ ఏ నివేదిక: జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ(ఎన్‌డీ ఎస్ ఏ) ఇచ్చిన నివేదిక ఆధారంగానే ఇప్పుడు విచారణకు ఆదేశించే అవకాశం కనిపిస్తోంది. దీనిని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జలశక్తి శాఖ ఇచ్చింది. గత ఆరుమాసాల్లో రెండుసార్లు పరిశీలించిన ఎన్డీ ఎస్ ఏ అధికారులు ఈ నివేదికను రూపొందిం చారు. దీనిలో ప్రధానంగా మేడిగడ్డ కాదు.. తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్టును ప్రారంభించలేదని పేర్కొన్నారు . అవినీతి కంటే కూడా.. దీనిలో టెక్నికల్ అంశాలను ప్రస్తావించారు. కాబట్టి.. ఎన్డీఎస్ ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టినా.. దీనిలో అవినీతి జరిగిందని కానీ.. గత ప్రభుత్వ పెద్దల ప్రాధాన్యం ఉందని కానీ.. ఎన్‌డీఎస్ ఏ నివేదిక పేర్కొనలేదు. కేవలం.. నిర్మాణం, సాంకే తిక అంశాలను, నీటి లభ్యతను మాత్రమే ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో దీనిపై సీబీఐని వేసినా.. రేవంత్ సర్కారులక్ష్యంగా పెట్టుకున్న అవినీతిని వెలికితీయడం.. సొమ్ములు వెనక్కి రప్పించడం సాధ్యం కాకపోవచ్చన్న చర్చ ఉంది. 2) ప్రజల్లోకి వెళ్లడం: కేసీఆర్ అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్తామని సభలో పొన్నం ప్రభాకర్ చెప్పినట్టు.. ఈ వ్యవహారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో బీఆర్ ఎస్ కూడా.. తన సత్తా మేరకు ఎదురు దాడి చేయడం ఖాయం. ఇక, మూడో ఆప్షన్.. సిట్ వేయడం. కాళేశ్వరం కమిషన్ రిపోర్టు ఆధారంగా సీబీఐ వేస్తే.. హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్నిఏర్పాటు చేయడం ద్వారా.. దీనిపై కొంత మేరకు పైచేయి సాధించే అవకాశం ఉంటుంది. ఈ ఆప్షన్లే ప్రస్తుతం ప్రభుత్వానికి ఉన్నాయని అంటున్నారు పరిశీలకులు.

# వైఎస్... పేదల గుండెలపై చెరగని సంతకం..!



**హైదరాబాద్ పెన్ పవర్:** వైఎస్ రాజశేఖరరెడ్డి. సముద్రం వంటి కాంగ్రెస్ పార్టీలో అనేక మంది నాయకుల మాదిరిగా కలిసిపోలేదు. తనో కెరటమై పైకి లేచారు. ఉత్తుంగ తరంగంలా పైకెగిరారు. కింద పడలేదు.. ఎగిరి పేదల గుండెల్లో గూ డు కట్టుకున్నారు. పోయినోళ్లందరూ మంచోళ్లే.. అని ఆత్రేయ అన్నట్టుగా.. ఇలాంటి మంచోళ్లలో మహానే త తనకంటూ ప్రత్యేక స్థానం దక్కించుకున్నారు. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తనకంటూ.. ప్రత్యేక పీఠిక లిఖించుకున్నారు. ఎంతో మంది వచ్చారు.. పోయారు.. కానీ, ఒక సుస్థిర స్థానం సంపాయించుకున్న తెలుగు నాయకుల్లో ఎన్టీఆర్ తర్వాత.. ఆ స్థానం దక్కించుకున్నది ముమ్మాటికీ వైఎస్ రాజశేఖరరెడ్డే!.

నాకు రాజశేఖరరెడ్డికి రాజకీయంగా విభేదాలు ఉన్నాయి. మేం వేర్వేరు సిద్ధాంతాలను నమ్ముతాం. ఆయన దారి ఆయనది. మా దారి మాది. కానీ, ప్రజలకు సేవ చేయడంలో మాత్రం ఇద్దరిదీ ఒకే దారి. నేను ప్రారంభించిన అభివృద్ధి పనులను ఆయన ఎక్కడా ఆపలేదు. ముందుకు తీసుకువెళ్లారు. మరింత మెరుగు పరిచారు. అందుకే హైదరాబాద్ ఇప్పుడు ఒక స్థాయిలో ఉంది. - అని సాక్షాత్తూ.. వైఎస్‌కు రాజకీయ బద్ధ శత్రువు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఇవి.

ఇంతకుమించి.. వైఎస్‌కు సర్టిఫికెట్లు అవసరం లేదు. ఒక ప్రత్యర్థిని.. తనను రెండు సార్లు వరుసగా అధి కారంలోకి రాకుండా అడ్డుకున్న నాయకుడిని పొగడడాన్ని మించిన ప్రశంస రాజకీయాల్లో ఎక్కడా ఉండ దు. అంతేకాదు.. వైఎస్ ప్రారంభించిన.. అనేక పథకాలను ఇప్పటికీ చంద్రబాబు కొనసాగిస్తున్నారు. మంగళవారం(సెప్టెంబరు 2) వైఎస్ వర్ధంతి. ఆయన ఇప్పుడు లేరు. కానీ, ఇది భౌతికంగానే. మానసికంగా చూస్తే.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య శ్రీ అన్నా.. ఫీజు రీయింబర్స్‌మెంటు అన్నా.. ఇందిరమ్మ ఇళ్లు అన్నా.. ఆయన పేరు వినిపిస్తూనే ఉంది.

ఇక, పేదల గుండెల్లో ఇప్పటికీ వైఎస్ చిరస్మరణీయుడు. నాయకులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క లక్షణం ఉంటుంది. దీనిలో వైఎస్ పేరు మరో స్థాయికి వినిపిస్తుంది. అలా ఆయన పాలన ముందుకు సాగింది. పాలన సాగించింది.. స్వల్ప కాలమే. అయినా.. తాను తీసుకువచ్చిన పథకాలు, ప్రజలకు అందుబాటులో ఉండే ముఖ్యమంత్రిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. -ఏం వచ్చారు.. వైఎస్ ఏమైనా చేస్తున్నారా?- అని పార్టీ అధిష్టానం అడిగినప్పుడు.. -అందుకు కాదు..- అని వైఎస్ ప్రత్యర్థులు సొంత పార్టీవారే.. నీళ్లు నమిలిన స్థాయికి వైఎస్ చేరిపోయారు. పడిపోయిందనుకున్న కాంగ్రెస్‌ను పైకిలేపి.. జవసత్వాలు అందించారు. అందుకే.. ఆయన పేదల పక్షపాతి మాత్రమే కాదు.. కాంగ్రెస్‌కు మార్గనిర్దేశకుడు కూడా!.

# రాజకీయాల్లో నిజాల పై నిషేధం.. గడ్కారీ ఏం చెప్పారు సార్




**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ రాజకీయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 11 ఏళ్లుగా కేంద్ర మంత్రిగా అంతకు ముందు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసిన గడ్కారీ దేశ రాజకీయాలపై విసిగిపోయారా? అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయాల్లో ప్రజలను మోసం చేయగలిగిన వాడే నేతల్లోకెల్లా గొప్ప నేతగా గుర్తింపు తెచ్చుకుంటారని గడ్కారీ వ్యాఖ్యానించారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కేంద్ర మంత్రి ఏ ఉద్దేశంతో..? ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారని పరిశీలకులు ఆరా తీస్తున్నారు. ఆర్ఎస్ఎస్ కు అత్యంత సన్నిహితుడిగా గడ్కారీని చెబుతారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కేంద్రం నాగపూర్ నుంచి వరుసగా ఎంపీగా గెలుస్తూ వచ్చిన గడ్కారీ ఒకనొక దశలో దేశ ప్రధాని అభ్యర్థిగా ప్రచారం జరిగింది. వాజపేయి హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న గడ్కారీ బీజేపీ జాతీయ అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఇక ప్రధాని మోదీ క్యాబినెట్ లో మూడో సారి కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న గడ్కారీ గత పదకొండేళ్లుగా ఒకేశాఖను నిర్వహిస్తున్నారు. బీజేపీలో అత్యంత ప్రతిభావంత నేతల్లో ఒకరుగా భావించే గడ్కారీ తాజా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. అఖిల భారత మహానుభావ పరిషత్ నిర్వహించిన సమావేశంలో గడ్కారీ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. బతకడానికి దగ్గరిదారులు (షార్ట్ కట్స్) వెతకొద్దని, నిబద్ధత, నిజాయితీ, విశ్వసనీయుతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దగ్గరిదారులు సత్వర ఫలితాలు ఇవ్వొచ్చునేమో గానీ, దీర్ఘకాలంలో విశ్వసనీయుతను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. విజయం ఎప్పుడూ సత్యం వెంటే ఉంటుందని భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా ఎప్పుడైనా చివరికి సత్యమే గెలుస్తుందని చెప్పాడని పేర్కొన్నారు.

ఈ సమయంలో తన కోసం ఆయన మాట్లాడుతూ, దైనందన జీవితంలో అంటే రాజకీయాల్లో నిజం మాట్లాడటం నిషేధమని ఆయన వ్యాఖ్యానించడం ఆసక్తి రేపింది. 'నేను పనిచేసే రంగంలో మనస్ఫూర్తిగా మాట్లాడటం నిషేధం, ఎవరైతే ప్రజలను మోసం చేస్తారో వారే గొప్ప నాయకులు' అంటూ తనదైన శైలిలో చమత్కరించారు. ఆయన ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారో అంతుచిక్కడం లేదని బీజేపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.ఇటీవల కాలంలో గడ్కరీ అనేక సంచలన వ్యాఖ్యలు చేస్తూ అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంటున్నారని అంటున్నారు. కోర్టు కేసుల వల్ల ప్రభుత్వం క్రమశిక్షణతో పనిచేస్తుందని, పరిపాలన అద్భుతంగా సాగుతుందని ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కోర్టులను ఆశ్రయించే వారి కారణంగా రాజకీయ నాయకుల్లో క్రమశిక్షణ పెరుగుతోందని ఆయన అభిప్రాయపడటం, మంత్రులు చేయలేని పనులు న్యాయస్థానాలు చేస్తున్నాయని వ్యాఖ్యానించడం వెనుక బలమైన కారణమేదైనా ఉందా? అని ఆరా తీస్తున్నారు. అధికారంలో ఉంటూ ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రభుత్వంపైన, పాలనపైనా ఆయన వ్యతిరేకత పెంచుకుంటున్నారా? అనే చర్చకు కారణమవుతోందని అంటున్నారు. ఇదే సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా మంచి పనులు చేసే నేతలకు గౌరవం దక్కదని, చెడు పనులు చేసే వారికి శిక్షలు ఉండవని గతంలో గడ్కారీ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన విషయాన్ని అంతా గుర్తు చేస్తున్నారు.

# చైనా అధ్యక్షుడి రైట్ హ్యాండ్ తో మోదీ భేటీ.. ఏంటీ కథ



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు అత్యంత నమ్మకస్థుడైన కైక్వీతో ఇటీవల జరిపిన భేటీ అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఇది కేవలం ఒక సాధారణ సమావేశం కాదు.. భారత్-చైనా సంబంధాల్లో కొత్త శకం మొదలవుతోందన్న సంకేతాలను పంపింది. మరి ఈ భేటీ వెనుక ఉన్న అసలు మర్మం ఏమిటో చూద్దాం.

### కైక్వీ ఎవరు? ఎందుకంత ప్రాముఖ్యత?

కైక్వీ చైనా రాజకీయాల్లో ఒక కీలక వ్యక్తి. ఆయనను "నవ్వని నాయకుడు" అని దౌత్య వర్గాలు వర్ణిస్తాయి. సాధారణంగా ఆయన విదేశీ నేతలను కలవడం చాలా అరుదు. అయితే ఈసారి స్వయంగా జిన్‌పింగ్ ఆదేశాల మేరకు ఆయన మోదీతో సమావేశమయ్యారు. ఈయన ప్రస్తుతం చైనా కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియట్‌లో ఫస్ట్ ర్యాంకింగ్ హోదా, పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యత్వం వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ఆయన జిన్‌పింగ్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. ఈ రెండు పదవులను ఒకేసారి చేపట్టిన అరుదైన వ్యక్తి ఈయనే. చైనా అధికార క్రమంలో ఆయన ఐదో స్థానంలో ఉన్నారు.

### మోదీ-కైక్వీ భేటీ ప్రాముఖ్యత

మోదీ-కైక్వీ మధ్య దాదాపు 45 నిమిషాల పాటు భేటీ జరిగింది. ఈ సమావేశం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఎస్‌సీవో సమావేశంలో పాల్గొన్న ఇతర దేశాల నాయకులను కైక్వీ బహిరంగంగా కలవలేదు. కానీ మోదీతో ద్వైపాక్షిక భేటీకి హాజరయ్యారు. ఇది ఇరు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడానికి చైనా ఆసక్తి చూపుతోందనే ఒక బలమైన దౌత్య సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మకస్థుడు అయిన కైక్వీని సంప్రదింపులకు పంపడం ద్వారా భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి చైనా సీరియస్‌గా ఉందని స్పష్టమవుతోంది. ఇది చైనాలోని భారత వ్యతిరేక వర్గాలకు కూడా ఒక కఠిన సందేశాన్ని పంపినట్లు కనిపిస్తోంది. గాల్వాన్ లోయ ఘర్షణల తర్వాత భారత్-చైనా సంబంధాలు ఉద్రిక్తంగా మారాయి. ఈ భేటీ ద్వారా సరిహద్దు సమస్యలు, ఆర్థిక సహకారం వంటి విషయాలపై ఇరుదేశాల మధ్య పురోగతి సాధించేందుకు అవకాశం ఉందని భావిస్తున్నారు.

### జిన్‌పింగ్‌తో కైక్వీ బంధం

కైక్వీ రాజకీయ ప్రస్థానంలో జిన్‌పింగ్ పాత్ర చాలా కీలకమైంది. ఫుజియాన్ ప్రావిన్స్‌లో 1980ల్లో వారి పరిచయం మొదలైంది. జిన్‌పింగ్‌కు కైక్వీ ఎంతో విధేయుడు. కైక్వీనే తొలిసారి జిన్‌పింగ్‌ను మావో జెడాంగ్‌తో పోల్చారు. ఆయన రాజకీయ జీవితంలో అనూహ్యంగా ఎదుగుతూ ఇప్పుడు జిన్‌పింగ్‌కు అత్యంత కీలకమైన కుడిభుజంగా మారారు.

### భవిష్యత్ ఏం సూచిస్తుంది?

మోదీ-కైక్వీ భేటీ కేవలం ఒక ప్రోటోకాల్ సమావేశం కాదని, భారత్-చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని దౌత్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది ఇరు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత మార్గంలో ముందుకు సాగడానికి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించవచ్చు. అయితే భవిష్యత్తులో ఈ సానుకూల సంకేతాలు ఎంతవరకు వాస్తవ రూపం దాల్చుతాయో వేచి చూడాలి.

## రైనా మెచ్చిన టాప్-3 టీ20 బ్యాటర్స్ వీరే..
# అగ్రస్థానంలో సన్ రైజర్స్ ప్లేయర్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్ లో విధ్వంసకర ప్లేయర్స్ అంటే లిస్ట్ చాలానే ఉంటుంది. ముఖ్యంగా ప్రస్తుత జనరేషన్ లో ఇన్నోవేటివ్ షాట్స్ తో బ్యాటర్స్ ఓ రేంజ్ లో చెలరేగుతున్నారు. ఒకప్పుడు విధ్వంసం అంటే గేల్, మెక్ కలం, ఏబీ డివిలియర్స్ లాంటి కొంతమంది పేర్లే వినిపించేవి. కానీ ఇప్పుడు ఒకరి పేరు చెప్పడం చాలా కష్టం. కనీసం టాప్-3 ని ఎంచుకోవాలంటే కూడా కష్టంగా మారుతుంది. ఇదిలా ఉంటే.. భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా ప్రస్తుతం టీ20 క్రికెట్‌లో తన టాప్-3 బ్యాటర్లను ఎంచుకున్నాడు. వీరిలో ఒకరు సౌతాఫ్రికా క్రికెట్ స్టార్, ఇద్దరు ఇండియన్ క్రికెటర్లు ఉండడం ఉన్నారు. శుభంకర్ మిశ్రాతో పాడ్‌కాస్ట్‌లో రైనా మాట్లాడుతూ.. సౌతాఫ్రి కా విధ్వంసకర వీరుడు హెన్రిచ్ క్లాసెన్ ను తన టాప్ టీ20 బ్యాటర్ గా చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మ, టీమిండియా టీ20 కెప్టెన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ లను రెండు, మూడు స్థానాలకు ఎంపిక చేశాడు. క్లాసెన్ అరుదైన సిక్స్-హిట్టింగ్ సామర్థ్యం మిగిలిన వారి నుండి వేరు చేస్తోందని రైనా హైలైట్ చేశాడు. క్లాసన్ ఇటీవలే టీ20 క్రికెటర్లలో అత్యంత ప్రమాదకర బ్యాటర్ గా నిలిచాడు. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ కు ముందు సన్ రైజర్స్ హైదరాబాద్ ఈ సఫారీ బ్యాటర్ ను ఏకంగా రూ. 23 కోట్ల రూపాయలను ఇచ్చి రిటైన్ చేసుకోవడం విశేషం. పరిమిత ఓవర్ల క్రికెట్ లో తన పవర్ హిట్టింగ్ తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసే క్లాసన్ క్రికెట్ కు గుడ్ బై చెప్పడం సంచలనంగా మారింది. 33 ఏళ్ళ క్లాసన్ సౌతాఫ్రికా తరపున 58 టీ20ల్లో 1000 పరుగులు చేశాడు. అభిషేక్ శర్మ ఇంగ్లాండ్స్ పై కొట్టిన సెంచరీ తనను ఎంతగానో ఇంప్రెస్స్ చేసిందని రైనా చెప్పాడు. సూర్య కుమార్ యాదవ్ కు టీ20 క్రికెట్ లో చాలా రకాల షాట్స్ ఆడగలిగే సామర్థ్యం ఉందని తెలిపాడు. ప్రస్తుతం సూర్య, అభిషేక్ ఆసియా కప్ కోసం సిద్ధమవుతున్నారు. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీని తొలిసారి 8 జట్లు ఆడుతున్నాయి.

# టెస్ట్ క్రికెట్‌కు బ్రేక్.. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ సంచలన నిర్ణయం







**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ బౌలింగ్ ఆల్ రౌండర్ జామీ ఓవర్టన్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ ఇంగ్లాండ్ పేసర్ టెస్ట్ క్రికెట్ నుంచి లాంగ్ బ్రేక్ తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. కేవలం రెడ్-బాల్ ఫార్మాట్ నుండి బ్రేక్ తీసుకోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సాధారణంగా ఇంగ్లాండ్ క్రికెటర్లు టెస్ట్ క్రికెట్ కు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. కానీ ఓవర్టన్ మాత్రం సుదీర్ఘ ఫార్మాట్ ఆడేందుకు ఆసక్తి చూపించడం లేదు. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ప్రకటనలో తాను టెస్ట్ క్రికెట్ నుంచి లాంగ్ బ్రేక్ తీసుకుంటున్నట్టు సోమవారం (సెప్టెంబర్ 1) ధృవీకరించాడు.

నవంబర్ నవంబర్ 21 నుంచి ప్రారంభం కాబోయే యాషెస్ సిరీస్ కు ఈ ఇంగ్లాండ్ పేసర్ అందుబాటులో ఉండడు. ఇటీవలే ఇండియాతో జరిగిన టెస్ట్ సిరీస్ ఓవర్టన్ పెద్దగా ప్రభావం చూపలేదు. %జుజదీ% ప్రకటనలో ఓవర్టన్ ఇలా అన్నాడు.. "చాలా ఆలోచించిన తర్వాత, నేను రెడ్-బాల్ క్రికెట్ నుండి లాంగ్ బ్రేక్ తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. రెడ్-బాల్, ఫస్ట్-క్లాస్ క్రికెట్ నా ప్రొఫెషనల్ కెరీర్‌కు పునాది వేసింది. ఇక్కడే నేను ఆట నేర్చుకున్నా. నా లక్ష్యాలకు ఆశయాలను టెస్ట్ క్రికెట్ ముందుకు తీసుకెళ్లింది. నా కెరీర్‌లోని క్రికెట్ కంమిట్మెంట్స్ ఎక్కువ ఉండడం కారణంగా అన్ని ఫార్మాట్ లకు కట్టుబడి ఉండడం సాధ్యం కాదు". అని జామీ ఓవర్టన్ తెలిపాడు. ప్రస్తుతం ఇంగ్లాండ్ స్క్వాడ్ లో ఓవర్టన్ స్థానం దక్కించుకుంటున్నప్పటికీ తుది జట్టులో అతన్ని పక్కన పెడుతున్నారు. జోఫ్రా ఆర్చర్, క్రిస్ వోక్స్, మార్క్ వుడ్, ఓలీ స్టోన్, అట్కిన్సన్, కార్స్, టంగ్ లాంటి లాంటి పేసర్లు అదరగొడుతున్నారు. మరోవైపు వన్డే, టీ20 జట్టులో ఓవర్టన్ రెగ్యులర్ ప్లేయర్. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న టీ20 లీగ్స్ ఆడుతూ బిజీగా మారాడు. ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున ఆడుతున్నాడు. ఇంగ్లాండ్ తరపున రెండు టెస్ట్ మ్యాచ్‌ల్లో ఆడిన ఓవర్టన్ 99 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు కూడా ఆడాడు. రెండు టెస్టుల్లో నాలుగు ఇన్నింగ్స్ ల్లో నాలుగు వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్.. టీ20ల్లో అగ్రస్థానానికి ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 క్రికెట్ లో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ తన హవా కొనసాగుతున్నాడు. జాతీయ జట్టు, ఐపీఎల్ తో పాటు ప్రపంచంలో ఎక్కడ టీ20 లీగ్ జరిగినా రషీద్ అదరగొడతాడు. అందుకే ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ లీగ్ జరిగినా ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ను పోటీ పడి మరీ తీసుకుంటారు. తన స్పిన్ మాయాజాలంతో టీ20 క్రికెట్ లో ఎన్నో రికార్డులు తన పేరిట లిఖించుకున్న రషీద్ ఖాన్.. తాజాగా టీ20 క్రికెట్ లో చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20 ఫార్మాట్ లో అత్యధిక వికెట్లు తీసుకొన్న బౌలర్ గా నిలిచాడు.

ట్రై సిరీస్ లో భాగంగా సోమవారం (సెప్టెంబర్ 1) యూఏఈ జట్టుతో జరిగిన మ్యాచ్ లో రషీద్ ఖాన్ మూడు వికెట్లు పడగొట్టాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో రషీద్ 165 వికెట్లతో సౌథీని వెనక్కి నెట్టి అగ్ర స్థానానికి చేరుకున్నాడు. ఈ మ్యాచ్ ముందువరకు సౌథీ 164 వికెట్లతో టాప్ లో ఉండగా.. రషీద్ మూడు వికెట్లతో అగ్ర స్థానానికి చేరుకోవడంతో రెండో స్థానానికి పడిపోయాడు. యూఏఈ బ్యాటింగ్ ఆల్ రౌండర్

ధ్రువ్ పరాశర్ వికెట్ పడగొట్టి రషీద్ ఈ ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్ లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పై ఆఫ్ఘనిస్తాన్ 38 పరుగుల తేడాతో గెలిచింది.

ఓవరాల్ గా టీ20 క్రికెట్ లోనూ రషీద్ ఖాన్ అగ్ర స్థానంలో ఉండడం విశేషం. 480 పైగా ఇన్నింగ్స్‌ల్లో 18.54 సగటుతో 650 పైగా వికెట్లు పడగొట్టి టాప్ లో ఉన్నాడు. 582 మ్యాచ్‌ల్లో బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో.. 589 వికెట్లతో వెస్టిండీస్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ మూడో స్థానంలో కొనసాగుతున్నారు. దక్షిణాఫ్రికా స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ (547), బంగ్లాదేశ్ ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్ (498) వికెట్లతో నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నారు. 26 ఏళ్ల ఈ రషీద్ ఖాన్ ఇటీవలే జరిగిన ఐపీఎల్ సీజన్ 2025లో పెద్దగా రాణించలేదు. 15 మ్యాచ్‌లలో 57.11 సగటుతో 9 వికెట్లు మాత్రమే పడగొట్టగలిగాడు. ఐపీఎల్ లో విఫలమైనా హండ్రెడ్ లీగ్ లో ఈ ఆఫ్ఘన్ స్పిన్నర్ ఫామ్ లోకి వచ్చాడు.

# గ్లోబల్ లెవెల్ లో ఎన్టీఆర్ - నీల్

**పూనమ్ బజ్వా ఫ్యాషన్‌కి నిప్పు పెడుతోంది**








'వార్ 2' డిజాస్టర్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల ఫోకస్ మొత్తం ఒకే సినిమా మీద ఉంది. అదే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామా. డ్రాగన్ అనే టైటిల్ డిస్కషన్ లో ఉన్న విషయం తెలిసిందే. ఇక కెజీఎఫ్, సలార్ లాంటి సినిమాలతో నీల్ తన స్టైల్ చూపించిన తర్వాత, ఇప్పుడు ఎన్టీఆర్‌తో కలసి మరో రేంజ్‌లో ఆడియన్స్‌ని ఎంటర్టైన్ చేయబోతున్నాడు. ఈ కాంబినేషన్‌పై అంచనాలు మొదటి నుంచి హై రేంజ్ లోనే ఉన్నాయి

తాజాగా ఈ ప్రాజెక్ట్ నుంచి ఒక కీలక అప్డేట్ వచ్చింది. ప్రశాంత్ నీల్ ఇప్పటివరకు తీసిన సినిమాల్లో ఒక్క కథను కూడా దేశాన్ని దబాటించింది లేదు. కథ మొత్తం ఒక దేశం లేదా ఒక ఉహాత్మక ప్రపంచంలో జరుగుతున్నట్లు చూపిస్తూ వస్తున్నారు. కానీ ఈసారి మాత్రం స్టోరీ డిమాండ్ మేరకు ఆయన బౌండరీల దాటి వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.ఎన్టీఆర్ సినిమాలో గ్లోబల్ కనెక్షన్ ఉండటంతో, మొదటిసారి ఇండియాకు వెలుపల ఒక లాంగ్ షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నారు. ఎక్కడ షూట్ జరుగుతుందనేది ఇప్పటివరకు రహస్యంగానే ఉంచారు కానీ, ఈ నిర్ణయం సినిమా స్కేల్‌ని మరింత పెంచింది. సినిమాలో ఎన్టీఆర్ కొత్త లుక్ ఇప్పటికే వైరల్ అయ్యింది. బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో తారక్ పూర్తిగా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడని మేకర్స్ చెప్పినట్టే, పోస్ట్ ప్రొడక్షన్ దశ నుంచే అంచనాలు పెరిగాయి.

ఈసారి ఆయన పాత్రలో మాఫియా షేడ్స్, పవర్‌ఫుల్ యాక్షన్ ట్రాక్ ఉంటుందని టాక్ వినిపిస్తోంది. థియేటర్లలో ఫ్లాష్‌బ్యాక్ సీన్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తాయని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ప్రాజెక్ట్ కోసం ప్రశాంత్ నీల్ ప్రత్యేక సమయం కేటాయిస్తున్నాడు. డ్రాగన్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమా కేవలం యాక్షన్ ఎంటర్‌టైనర్ కాకుండా, ఎమోషనల్ కనెక్ట్ కలిగించేలా స్టోరీని రాసినట్లు సమాచారం.ఆయన కెరీర్‌లో ఇప్పటివరకు తీసిన సినిమాలన్నింటికంటే ఇది బెస్ట్ అవుతుందని అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు. ఆయన మ్యూజిక్ ఇప్పటికే కెజీఎఫ్‌కి పానిండియా లెవెల్‌లో ఒక కొత్త ఇమేజ్ ఇచ్చింది. అదే రేంజ్‌లో డ్రాగన్‌కి కూడా ఆయన మ్యూజిక్ హైలైట్ కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ భారీ సినిమాను నిర్మిస్తున్నారు. 2026 జూన్‌లో గ్రాండ్ రిలీజ్ టార్గెట్‌గా టీమ్ ముందుకు వెళ్తోంది.

**సోనమ్ బజ్వా దీవెనలలో నివసిస్తున్నారు**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com